www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి
TELANGANA RISING
CURE - PURE - RARE
EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:14 FRIDAY , MAY 22,2026 PAGES:8 COST: 4 /-
ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 14 శుక్రవారం 22 మే 2026 పేజీలు :8 వెల: 4/-



# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త
## మీడియా సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



మే 21 హంసకలం వార్త

కార్మికులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. కనీస వేతనాలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర సచివాలయం లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి కీలక విషయాలను వెల్లడించారు. కార్మికుల కనీస వేతనాలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని సీఎం రేవంత్ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో 1.11 కోట్ల మంది కార్మికులు నష్టపోయారని.. అందుకే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీని నియమించామని అన్నారు. సబ్ కమిటీ నివేదించిన అంశాల పై చర్చించి రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. 'కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం తరపున శుభాకాంక్షలు. కార్మికులను నాలుగు కేటగిరీలుగా చేశాం. అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీ స్కిల్డ్‌గా విభజించాం. - మిగతా2లో

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత
## రాజీవ్‌కు నివాళి అర్పించిన సిఎం రేవంత్



మే 21 హంసకలం వార్త

దేశం కోసం ప్రాణాలర్పించిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా సచివాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి సీఎంతో పాటు కాంగ్రెస్ నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవాన్ని దేశానికి అందించిన గొప్ప దార్శనికుడు అని కొనియాడారు. - మిగతా2లో



# కార్మికులకు ప్రభుత్వం శుభవార్త

-మొదటిపేజీ తరువాయి

కనీసవేతనం నిర్ణయించాం అన్నారు. అన్‌స్కిల్డ్ కేటగిరీలో కనీస వేతనాన్ని రూ.12,750 నుంచి రూ.16 వేలకు పెంచాం. సెమీ స్కిల్డ్ కేటగిరీలో రూ.13,152 నుంచి రూ.17 వేలకు.. స్కిల్డ్ కేటగిరీలో రూ.13,772 నుంచి రూ.18,500కు పెంచాం. హైలీ స్కిల్డ్ కేటగిరీలో రూ.14,607 నుంచి రూ.20 వేలకు పెంచాం. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో 1.11 కోట్ల మంది కార్మికులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం జూన్ 1, 2026 నుంచి అమలవుతుందని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మొదటిసారిగా కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న నిర్ణయం ఇది. గత ప్రభుత్వం తన బాధ్యతను వదిలేసింది. మా ప్రభుత్వం బాధ్యతతో వారి ప్రయోజనం కోసం నిర్ణయం తీసుకుంది. కార్మిక నాయకుడంటే వెంకటస్వామి గుర్తొస్తారు. ఆయన వారసుడిగా మంత్రి వివేక్ వెంకటస్వామి.. కార్మికుల సంక్షేమం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. యువతకు నేను ఒకటే సూచన చేస్తున్నా. ఐటీ, అమెరికా అనే ఆలోచనను వీడండి. ఉద్యోగాలు రాని, ఉపాధి అవకాశాలు లేని చదువులు వ్యర్థం. సాంకేతిక నైపుణ్యంతో జర్మనీ, జపాన్, సింగపూర్ లాంటి ఇతర దేశాల్లో అనేక అవకాశాలు ఉన్నాయి. అందుకే రాష్ట్ర ప్రభుత్వం స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహిస్తోంది. ఆ దిశగా యువత దృష్టి సారించాలని సూచించారు. ప్రజా సమస్యలను, దేశాల మధ్య యుద్ధాన్ని బీజేపీ, ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయ కోణంలో చూస్తోంది. అందుకే ఎన్నికలు అయిపోగానే పెట్రోల్, డీజిల్ ధరలను రోజుకోసారి పెంచుతున్నారు. మా ప్రభుత్వం ప్రతి అంశాన్నీ దీర్ఘకాలిక దృష్టితో చూస్తుంది. అందుకే కార్మికుల కనీస వేతనం పెంపుపై నిర్ణయం తీసుకున్నాం. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ 80 శాతం పూర్తయింది. ఇంకా 20 శాతం మిగిలి ఉంది. ఆ ప్రక్రియ కూడా త్వరలోనే పూర్తి చేస్తాం. బీఆర్ఎస్ నేతలు మానవత్వం మరిచిపోయి వ్యవహరిస్తున్నారు. రైతుల విషయంలో శవ రాజకీయాలు చేయాలని చూస్తున్నారు. రాజకీయాల కోసం మరీ ఇంత దిగజారి వ్యవహరిస్తారా?. నిజంగా రైతులపై ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. పోక్సో కేసులో బండి భగీరథ్‌ను పోలీసులే అరెస్ట్ చేశారని స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడిని అప్పగించి ఉంటే తమ ఇంట్లోనే అప్పగించి ఉండేవారు. పోక్సో కేసులో ఏదో సాధించినట్లు బీఆర్ఎస్ నేతలు వ్యవహరిస్తున్నారు. రాజకీయాలు చేయాలనుకుంటే ఎన్నికల్లో ఓడించాలి.. అంతేకాని దిగజారి ప్రవర్తించొద్దు. కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ దొరికినా నోటీసు ఇచ్చి విచారించాం. బండి భగీరథ్ విషయంలోనూ నోటీసులు ఇచ్చి విచారణ చేస్తున్నాం. పోక్సో కేసులో పోలీసులు ప్రొసీజర్ ప్రకారమే వ్యవహరిస్తున్నారు. కేటీఆర్ ఇంకా కల్వకుంట రాజ్యాంగంలోనే ఉన్నానని అనుకుంటున్నారని అంటూ ఎద్దేవా చేశారు.

# దేశం కోసం ప్రాణాలర్పించిన మహానేత

-మొదటిపేజీ తరువాయి

'కంప్యూటర్, ఐటీ, టెలికామ్‌లను దేశానికి తీసుకువచ్చింది ఆయనే. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్లు తెచ్చారు. రాహుల్‌గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసింది. తెలంగాణ సమాజం సోనియాగాంధీ కుటుంబానికి ఎంతో రుణపడి ఉంది. సోనియా సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ సాకారమైంది. మహిళా రిజర్వేషన్ల అమలు బిల్లులో మోదీ సర్కార్ కుయుక్తులు పన్నింది. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు డీలిమిటేషన్‌తో లింక్ పెట్టారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి.. మహిళా బిల్లును ఎన్డీఏ ప్రభుత్వం మళ్లీ పార్లమెంట్‌లో పెట్టాలని సీఎం డిమాండ్ చేశారు. దేశంలో సాంకేతికతను తీసుకొచ్చిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. దేశంలో మహిళా రిజర్వేషన్లు తీసుకొచ్చారని తెలిపారు. సరళీకృత విధానాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన గొప్ప దార్శనీకుడు రాజీవ్ అని చెప్పు కొచ్చారు. సోనియా గాంధీ సాహసోపేత నిర్ణయంతోనే తెలంగాణ కల సాకారమైందని సీఎం అన్నారు. తెలంగాణకు గాంధీ కుటుంబంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. అది కుటుంబ సంబంధం కంటే ఎక్కువని తెలిపారు. తెలంగాణ ఉన్నంత వరకు ప్రజలు గాంధీ కుటుంబాన్ని గుర్తు చేసుకుంటారని అన్నారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకురావాలన్నారు. తక్షణమే ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు ఏర్పాటు చేసి లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఇండియా కూటమి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు. మహిళా రిజర్వేషన్ల ముసుగులో రాజకీయాలు చేయాలనుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. రాజీవ్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సీఎంతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు... రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దానం నాగేందర్, అంజన్ కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరు-రామగుండం రైల్వే లైన్‌కు ఆమోదం

మే 21 హంసకలం వార్త

తెలంగాణ రాష్ట్రంలో రవాణా రంగాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్లేలా కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త చెప్పింది. రాష్ట్రంలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కీలకమైన మణుగూరు- రామగుండం కొత్త రైల్వే లైన్ ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ సర్కార్ అధికారికంగా ఆమోదముద్ర వేసింది. దాదాపు రూ. 5,818.45 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టును పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యం పద్ధతిలో చేపట్టనున్నారు. ఈ కొత్త లైన్ అందుబాటులోకి వస్తే తెలంగాణలోని మారుమూల గిరిజన ప్రాంతాలకు రైల్వే సౌకర్యం దక్కడంతో పాటు, ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లే భక్తులకు పెద్ద ఉపశమనం లభించనుంది. మొత్తం 207.8 కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న ఈ సరికొత్త రైల్వే లైన్ మంథని, భూపాలపల్లి, తాడ్వాయి, గోపాలరావుపేటలతో పాటు ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర జరిగే మేడారం మీదుగా వెళ్లనుంది. ప్రస్తుతం మణుగూరు నుండి రామగుండం వెళ్లాలంటే భద్రాచలం రోడ్ (కొత్తగూడెం), కాజీపేట మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఈ కొత్త లైన్ పూర్తయితే మణుగూరు-రామగుండం మధ్య ఏకంగా 90 కిలోమీటర్ల దూరం తగ్గనుంది. దీనివల్ల ప్రయాణికులకు సమయం, డబ్బు భారీగా ఆదా అవుతాయి. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరతో పాటు, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానానికి వెళ్లే భక్తులకు కనెక్టివిటీ మరింత సులభతరం కానుంది. ఈ ప్రాజెక్ట్ ముఖ్యంగా ములుగు, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని వెనుకబడిన మారుమూల గిరిజన ప్రాంతాలకు ఒక పెద్ద వరంగా మారబోతోంది. దశాబ్దాలుగా రైలు ముఖం చూడని ఎన్నో గ్రామాలకు ఈ లైన్ ద్వారా రైల్వే కనెక్టివిటీ లభిస్తుంది. కేవలం ప్రయాణికులకు మాత్రమే కాకుండా, ఈ ప్రాంతంలో లభించే బొగ్గు, ఖనిజాలు, ఎరువులు , ఇతర పారిశ్రామిక సరుకు రవాణాకు ఈ రైల్వే లైన్ అత్యంత కీలకంగా మారనుంది. దీనివల్ల సింగరేణి బొగ్గు



గనుల రవాణా మరింత వేగవంతం కానుంది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేసేందుకు రైల్వే శాఖ సరికొత్త ప్లాన్ సిద్ధం చేసింది. డీపీఆర్ తయారీ, భూసేకరణ, వివిధ ప్రభుత్వ శాఖల నుండి అనుమతులు తీసుకునే బాధ్యతలను రైల్వే శాఖ చూసుకుంటుంది. అయితే, ప్రాజెక్ట్ నిర్మాణం , నిధుల సమీకరణ పనులను ప్రైవేట్ భాగస్వామ్య సంస్థకు అప్పగిస్తారు. దీనికోసం రైల్వే శాఖ త్వరలోనే టెండర్లను ఆహ్వానించనుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం.. మొదటి ఏడాదిలో పూర్తిగా భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి, ఆ తర్వాత నాలుగు సంవత్సరాల్లో అంటే మొత్తం ఐదేళ్ల వ్యవధిలో ఈ కొత్త రైల్వే లైన్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇదిలావుంటే కేంద్ర రైల్వేమంత్రి అశ్విని వైష్ణవ్‌ను కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై ఇరువురు చర్చించారు. తెలంగాణలో రైల్వేప్రాజెక్టుల పురోగతి, కొత్త ప్రాజెక్టులు, ఎలక్ట్రిఫికేషన్ తదితర ప్రాజెక్టుల పై మాట్లాడారు. ఈ సమావేశంలో తెలంగాణలోని 42 ప్రధాన రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు సంబంధించి వివరంగా చర్చించారు.

# రేవంత్ కు కేటీఆర్ బహిరంగ లేఖ.. ఎన్నాళ్లీ మొద్దు నిద్ర అని ప్రశ్న!

మే 21 హంసకలం వార్త



అన్నదాతల సమస్యల పై దిద్దుబాటు చర్యలు చేపట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాటు బీఆర్ఎస్ హయాంలో కొండంత ధైర్యంతో బతికిన సాగు రంగాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం కొద్ది నెలల్లోనే కన్నీటి సేద్యంగా మార్చేసిందని ఆయన ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా పంట అమ్ముకోవడానికి వచ్చిన రైతులు కొనుగోలు కేంద్రాల వద్దే వారాల తరబడి పడిగాపులు కాస్తూ, గుండెపగిలి కుప్పకూలుతున్నా ప్రభుత్వానికి కనీస సోయి లేదని కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి తన కుర్చీని కాపాడుకోవడానికి 70 సార్లు ఢిల్లీ చుట్టూ తిరగడంపై ఉన్న శ్రద్ధలో ఒక్క శాతం కూడా రైతులపై పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ఎండ తీవ్రతకు, వడదెబ్బకు తోడు ప్రభుత్వం చేస్తున్న ఆలస్యం వల్ల దాదాపు 10 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని లేఖలో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఖమ్మం దాకా ఎక్కడ చూసినా రోజుకు కనీసం ఒక్క లారీ లోడ్ కూడా ఎత్తడం లేదని, అడపాదడపా కొనే చోట కూడా క్వింటాలుకు 10 కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి గన్నీ బ్యాగుల కోసం రైతుల నుంచే రూ. 50 డిపాజిట్ వసూలు చేసే దుస్థితి తేవడం సిగ్గుచేటన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ మూడు నెలల ముందే ప్రణాళికలు వేసి, కరోనా కష్టకాలంలోనూ రైతుల కల్లాల వద్దకే వెళ్లి చివరి గింజ వరకు కొనుగోలు చేసేలా భరోసా ఇచ్చారని కేటీఆర్ నీపేర్కొన్నారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకోవడానికి కనీసం టార్పాలిన్లు కూడా సమకూర్చలేకపోతోందని, దీనివల్ల రైతులు కళ్లముందే ధాన్యం కొట్టుకుపోతుంటే నిస్సాహాయ స్థితిలో ఉన్నారని మండిపడ్డారు.

## ఆఫ్రికాలో తీవ్రం అవుతున్న ఎబోలా




మే 21 హంసకలం వార్త

ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఆరోగ్య కార్యదర్శులు హాజరయ్యారు. సమావేశంలో ఎబోలా వైరస్ నివారణకు అవసరమైన ముందు జాగ్రత్తలు, ఆరోగ్య సన్నాహాలు, అత్యవసర స్పందన చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం భారతదేశంలో ఎలాంటి ఎబోలా కేసులు నమోదు కాలేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఆఫ్రికా దేశాల్లో వైరస్ తీవ్రంగా వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించడంతో కేంద్రం అప్రమత్త చర్యలు ప్రారంభించింది. దేశంలోని అంతర్జాతీయ విమానాశ్రయాలు, ఓడరేవుల్లో నిఘా వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల స్క్రీనింగ్, అనుమానితులను క్వారంటైన్‌లో ఉంచడం, ప్రత్యేక పరీక్షా సదుపాయాలు కల్పించడం వంటి అంశాలపై రాష్ట్రాలకు వివరణాత్మక మార్గదర్శకాలు పంపింది. అదేవిధంగా ఆసుపత్రుల్లో ప్రత్యేక ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించింది. గతంలో అంటువ్యాధుల సమయంలో అమలు చేసిన విధానాలను మళ్లీ కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ప్రస్తుతం ఆఫ్రికా దేశమైన డెమోక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో ఎబోలా తీవ్రస్థాయిలో వ్యాపిస్తోంది.

## ఘనంగా సరస్వతీ పుష్కరాలు ప్రారంభం



మే 21 హంసకలం వార్త

పుష్కరాలకు వచ్చే భక్తుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపి తొలిసారి అంత్య పుష్కరాలు నిర్వహిస్తోంది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని అసౌకర్యం కలగకుండా భారీ టెంట్లు, కూలర్లు సైతం ఏర్పాటు చేశారు. సరస్వతీ ఘాట్‌తోపాటు ప్రధాన ఘాట్ వద్ద స్నానాలు ఆచరించేవారు దుస్తులు మార్చుకొనేందుకు తాత్కాలిక గదులను 300కు పైగా ఏర్పాటు చేశారు. నదిలో లోతులోకి వెళ్లకుండా భద్రతా చర్యల్లో భాగంగా తాళ్లతో హద్దులు ఏర్పాటు చేశారు. జూన్ 1 వరకు ప్రతిరోజు సాయంత్రం హారతి ఉంటుంది. అంత్య పుష్కరాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి భక్తులు వస్తారని అధికారులు చెబుతున్నారు. ప్రాణహిత, గోదావరి నదుల్లో అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహిస్తున్న ప్రాంతంగా కాళేశ్వరం ప్రసిద్ధి చెందింది. దేశంలో సరస్వతి నది ఉన్నది ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, రెండోది కాళేశ్వరంలోనే. అక్కడ కుంభమేళా నిర్వహించటం ఆనవాయితీ. కాగా, తెలంగాణలో తొలిసారి అంత్య పుష్కరాలకు సైతం ప్రాధాన్యమిచ్చి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం విశేషం.

## సమస్యలు ప్రస్తావి స్తే వ్యక్తిగత దూషణలా



మే 21 హంసకలం వార్త

సంస్కారానికే నిదర్శనమని, వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి హితవు పలికారు. గురువారం పెద్దపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. లుచ్చా పని చేసేటోడికి అందరూ లుచ్చలాగే కనిపిస్తారని, దొంగ పని చేసేటోడికి అందరూ దొంగలాగే కనిపిస్తారు..'అంటూ చురకలు అంటించారు. మట్టి వ్యవహారంపై స్పందిస్తూ, తాను చెరువు మట్టిని పొలాల్లో వేయడం అనేది అప్పటి ప్రభుత్వ పథకం 'మిషన్ కాకతీయ'లో భాగం అన్నారు. చెరువులు లోతు కావాలి, మట్టి పొలాల్లో పడాలి, భూసారం పెరగాలి అనే ఆలోచనతో ప్రభుత్వం ఆ పథకం తీసుకువచ్చిందని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మైనింగ్, ఇరిగేషన్ శాఖల ద్వారా నియంత్రణ తీసుకువచ్చి రైతులకు మట్టి వినియోగం ప్రోత్సహించిందని గుర్తు చేశారు. ఇసుక అక్రమాల అంశంలో కూడా ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు.

# సంపాదకీయం


## 'తమిళ విజయం' మనకు ఆదర్శం




ప్రజలు ఆలోచిస్తున్నారు కాబట్టి మార్పు మొదలవుతుంది. ఈ మాట తమిళనాడు రాజకీయాలలో నిజమైంది. అలాగే తెలుగు రాష్ట్రాల రాజకీయ పరిస్థితులకు అక్షరాలా సరిపోతుంది. ఎన్నికలయిన దాదాపుగా ప్రతిసారి అధికార మార్పిడి జరుగుతున్నది, కానీ పాలన మారడం లేదు. పార్టీలు మారుతున్నాయి, కానీ రాజకీయ సంస్కృతి మారడం లేదు. టీడీపీ, వైఎస్ఆర్‌సీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్-- పేర్లు వేరయినా ప్రజల్లో పెరుగుతున్న భావన ఒక్కటే... అవినీతి, కుటుంబాధిపత్యం, కాంట్రాక్టర్ రాజకీయం, డబ్బు పంపిణీ, అధికార దుర్వినియోగం. ఒకప్పుడు సిద్ధాంతాల కోసం నడిచిన రాజకీయాలు ఇప్పుడు ఎన్నికల మేనేజ్‌మెంట్‌కు పరిమితమయ్యాయి. ప్రజా సమస్యల కంటే మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ ఇంజనీరింగ్, డబ్బు సమీకరణ, ఓటర్లకు పంపిణీ ప్రధాన అజెండాలుగా మారాయి. ఎన్నికలప్పుడు ప్రజలను గుర్తుచేసుకునే నాయకత్వం, తర్వాత కార్పొరేట్ వర్గాలకు దగ్గరవుతోందన్న అసంతృప్తి సామాన్యుల్లో ఉంది. బీజేపీ దక్షిణాదిలో స్థిరపడేందుకు ప్రయత్నిస్తోంది. కానీ ఉత్తర భారతంలో పనిచేసిన మత రాజకీయాలు ఇక్కడ పనిచేయడం లేదు. దక్షిణ భారత సమాజం సామాజిక న్యాయం, ఆత్మగౌరవం, భాషాభిమానం, సెక్యులర్ విలువలపై నిర్మితమైంది. ఇక్కడ ప్రజలు మత విద్వేషాల కంటే ఉద్యోగాలు, విద్య, వ్యవసాయం, ధరలు, జీవనోపాధి గురించి ఎక్కువగా ఆలోచిస్తారు. అయినా బీజేపీ ఒకవైపు ప్రాంతీయ పార్టీలతో రాజీ రాజకీయాలు చేస్తూనే, మరోవైపు మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల్లో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ శక్తికి విస్తృత అవకాశం ఏర్పడుతోంది. అదే బీసీ, దళిత, ఆదివాసీ, ముస్లిం, బహుజన రాజకీయాలు. సంఖ్యలో మెజారిటీ అయిన బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు రాజకీయ అధికారంలో మాత్రం ఎందుకు మైనారిటీగా మిగిలిపోతున్నారు అనే ప్రశ్న ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. తమిళనాడులో విజయ్ రాజకీయ ప్రవేశం ఈ ప్రశ్నకు ఒక కొత్త దిశ చూపించింది. రాజకీయ వారసత్వం లేకుండా, సంప్రదాయ మీడియా మద్దతు లేకుండా, డబ్బు పంచకుండా, కేవలం యువత నమ్మకంతో, క్లీన్ ఇమేజ్‌తో, సోషల్ మీడియా శక్తితో ఒక ప్రత్యామ్నాయ రాజకీయ వేదికను నిర్మించగలిగాడు. ఆయన గెలిచింది కేవలం ఓట్లు కాదు... ప్రజల నమ్మకం, అభిమానంతో పాటు మార్పు కోసం ఎదురుచూస్తున్న యువత ఆత్మగౌరవాన్ని. ఇది తెలుగు రాష్ట్రాల బహుజన యువతకు ఒక గొప్ప సంకేతం. "మనం కూడా చేయగలం... మనం కూడా గెలవగలం" అనే నమ్మకం కలిగించే ఉదాహరణ. బహుజన ఉద్యమం కేవలం కుల సంఘాల స్థాయిలో ఆగిపోకూడదు. అది ఆత్మగౌరవ ఉద్యమంగా మారాలి. బీసీలతో మొదలైన చైతన్యం ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, యువత, మహిళలు, అట్టడుగు వర్గాలందరినీ కలుపుకుంటూ విస్తరించాలి. "ఓటు మాది... సీటు మీదా?" అనే ప్రశ్న ప్రతి గ్రామంలో వినిపించాలి. ప్రజల హృదయాలను గెలుచుకోకుండా రాజకీయాలు గెలవలేమని అనడానికి తమిళనాడు ఉదాహరణ. డబ్బుతో కొన్ని ఓట్లు కొనవచ్చు. కానీ నమ్మకాన్ని కొనలేరు. నిజంగా డబ్బే ఎన్నికలను నిర్ణయిస్తే డబ్బున్నవాళ్లే శాశ్వతంగా అధికారంలో ఉండాలి. కానీ ప్రజాస్వామ్యంలో మార్పు జరుగుతూనే ఉంది. అంటే ప్రజలు ఇంకా ఆలోచిస్తున్నారు... ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఉద్యమానికి కేవలం ఆగ్రహం సరిపోదు. సిద్ధాంతం కావాలి. సామాజిక న్యాయం, సమానత్వం, సెక్యులరిజం, ఆత్మగౌరవం-- ఇవే పునాదులు కావాలి. అంబేడ్కర్, పూలే, పెరియార్, కాన్షీరాం వంటి మహానుభావుల ఆలోచనలు ఉద్యమానికి దిశానిర్దేశం చేయాలి. తెలంగాణలో సర్వాయి పాపన్న, చాకలి ఐలమ్మ, సమ్మక్క--సారలక్క, దొడ్డి కొమరయ్య వంటి పోరాట యోధుల వారసత్వం ఉద్యమానికి బలం కావాలి. ఇప్పుడు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పూర్తిగా కార్పొరేట్ రాజకీయాల ప్రభావంలో ఉన్న కాలం. అందుకే సోషల్ మీడియానే కొత్త తరహా ఉద్యమాల ప్రధాన ఆయుధంగా మారింది. ప్రతి గ్రామంలో ప్రతి యువకుడు ఒక ప్రచారకర్త కావాలి. ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లగలిగితేనే మార్పు సాధ్యమవుతుంది. ముఖ్యంగా, బహుజన రాజకీయాలు ద్వేష రాజకీయాలు కాకూడదు. ఆగ్రహం ఉండాలి కానీ, అసభ్యత కాదు. పోరాటం ఉండాలి కానీ, విద్వేషం కాదు. గౌరవంతో కూడిన రాజకీయ భాష ప్రజలను మరింత దగ్గర చేస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. పాత రాజకీయాలపై విసుగు వచ్చింది. ఇదే సరైన సమయం. బహుజన శక్తులు గ్రామగ్రామాన తిరగాలి. ప్రతి స్థానంలో పోటీ చేయాలి. ప్రజల్లో నమ్మకం నింపాలి. అధికారాన్ని అడుక్కోవడం కాదు, సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలి. ఎందుకంటే బహుజన భావజాలం కేవలం ఒక రాజకీయ ప్రత్యామ్నాయం కాదు, అది సామాజిక న్యాయ భారత నిర్మాణానికి మార్గం.

# ఆ జ్ఞాననిధులను విస్మరిస్తే వినాశనమే









'ఉత్తమ భావాలు అన్ని వైపుల నుంచి రావాలి' అని విశ్వసించిన మన పూర్వీకులు అభివృద్ధిపరిచిన జ్ఞాన వ్యవస్థలను గుడ్డిగా ఆరాధించడమో లేదా పూర్తిగా తిరస్కరించడమో జరుగుతోంది. ఇవి ఆలోచనారహిత వైఖరులు. భారతీయ జ్ఞాన వ్యవస్థల పట్ల అటువంటి ప్రతిస్పందనలు వివేకవంతమైనవి కావని ఇటీవలి రెండు నూతన పుస్తకాలు సూచించాయి. పురాతన భారతీయుల శాస్త్రీయ విజ్ఞానాన్ని, తాత్విక భావప్రవంతిని అల్లాటప్పా గా భావించకుండా గంభీరమైన మేధో నిబద్ధతతో మనం వాటిని శోధించి తీరాలని కూడా ఆ పుస్తకాలు నొక్కి చెప్పాయి. ఈ మేధా కర్తవ్యాన్ని ఎలా చేయాలో, ఎలా చేయకూడదో కూడా అవి నిర్దేశించాయి. భారతీయ ఉన్నత విద్యా జగత్తులో ఇప్పుడు విస్తృతంగా చర్చిస్తున్న విషయం భారతీయ జ్ఞాన వ్యవస్థలు (ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్స్-- ఐకేఎస్). ప్రతి విశ్వవిద్యాలయమూ ఐకేఎస్ సంబంధిత సదస్సును నిర్వహించి దాని వివరాలను సచిత్రంగా, సవివరంగా తమ వెబ్‌సైట్‌పై ఉంచుతున్నది. విద్యావేత్తలూ పురాతన భారతీయ జ్ఞాన సంచయంలో ఒక వినూత్న సత్యాన్ని ఆవిష్కరించేందుకు ఆరాటపడుతున్నారు. తమ పరిశోధనా కృషి, ఐకేఎస్ మధ్య ఉన్న సంబంధాన్ని సగర్వంగా చెప్పుకుంటున్నారు. భారతీయ జ్ఞాన వ్యవస్థలపై ఉన్నత విద్యా ప్రపంచంలో వెల్లివిరుస్తున్న ఈ అభిమానం సహజమైనదేనా? మేధో అంతః ప్రేరణల జనితమేనా? కాదు, కానే కాదు. ప్రభుత్వం పురికొల్పిన విద్యాసక్తి అది. పురాతన భారతీయుల జ్ఞానాన్ని ఆధునిక పాఠ్యాంశాలలో భాగంగా చేసేందుకై భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధన, బోధనను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వం పనిగట్టుకుని ప్రోత్సహిస్తున్న భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనా కార్యకలాపాల ప్రహసనంపై తీవ్ర విమర్శనాత్మక ప్రతిస్పందనలు అనివార్యంగా వ్యక్తమవుతున్నాయి. దేశ ప్రజల్లో 'వైజ్ఞానిక దృక్పథం'ను పెంపొందించాలని అభిలషిస్తున్నవారు పురాతన భారతీయ జ్ఞానం అశాస్త్రీయమైనదని, అర్థరహితమైనదని కొట్టివేస్తున్నారు. జ్ఞాన సంప్రదాయాలకు ప్రభుత్వం అంత ప్రాధాన్యమివ్వడాన్ని వారు ప్రశ్నిస్తున్నారు. కుల వ్యవస్థను వ్యతిరేకించేవారు బ్రాహ్మణీయ ప్రపంచ దృక్పథాన్ని సమస్త భారతీయులపై రుద్దే ప్రయత్నమే ఐకేఎస్‌ను ప్రోత్సహించడమని నిరసిస్తున్నారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నవారు నిరంకుశ పాలనా ధోరణులపై నిరసన ప్రబలకుండా అదుపు చేసేందుకే ఐకేఎస్ పేరిట మిథ్యా జాతీయ స్వాభిమానాన్ని పెంపొందిస్తున్నారని దుయ్యబడుతున్నారు. ఐకేఎస్‌కు అనుకూలంగా ప్రభుత్వం ఎంత ఎక్కువగా వాదిస్తే ప్రగతిశీల, ఉదారవాద విద్యావంతులు అంత ఎక్కువగా భారతీయ జ్ఞాన వ్యవస్థ అనే భావనను పరిహసిస్తున్నారు. ప్రభుత్వ వాదన ఎలా ఉన్నప్పటికీ ఐకేఎస్‌ను ఈ విధంగా అపహసించడం, తిరస్కరించడం తీవ్ర మేధాపరమైన, రాజకీయ తప్పిదమే అవుతుంది, సందేహం లేదు. సరే, ఆధునిక మానవ జ్ఞానచరిత్ర తన స్వీయ చరిత్రే అని పాశ్చాత్య ప్రపంచం భావిస్తోంది. మానవజ్ఞానానికి ఏకైక భండారం తమ మేధ అని పాశ్చాత్య దేశాలు మిడిసిపడుతున్నాయి. అహంకరిస్తున్నాయి. ఇది పూర్తిగా చారిత్రక అసంబద్ధం. ప్రాచ్య ప్రపంచం ముఖ్యంగా భారతదేశం ఆ అసంగతాన్ని ఎలా విశ్వసిస్తుంది? సహిస్తుంది? తాము పుట్టి పెరిగిన మాతృభూమి జ్ఞాన వనరులు, మేధో సంప్రదాయాలపై రేపటి తరాలకు అవగాహన లేకుండా చేయడం సాంస్కృతిక వినాశనానికి దారితీస్తుంది. వేల సంవత్సరాల భారతీయ సాంస్కృతిక, నాగరికతా వారసత్వాన్ని మరచిపోవడం లేదా వాటికి దూరమవడం నిస్సందేహంగా రాజకీయ తప్పిదం అవుతుంది. వలసపాలన నుంచి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్న నాటి నుంచి మన మేధా సంప్రదాయాలను ఉపేక్షించామన్న గర్హనీయ వాస్తవాన్ని అంగీకరించడం ద్వారా భారతీయ జ్ఞాన వ్యవస్థలతో మన బాంధవ్యాన్ని అధునాతనం చేసుకోవడం ప్రారంభమవ్వాలి. భావాలలో స్వరాజ్య సాధనకు సంబంధించిన అజెండాలో భారతీయ జ్ఞానవనరుల పునరుద్ధరణ, పునర్నిర్మాణం అంతర్భాగమవ్వాలి. మేధోపరమైన, సాంస్కృతిక స్వీయ నిర్ణయాధికారమే నిజమైన స్వాతంత్ర్యం అనేది మనం విస్మరించకూడదు. ఐకేఎస్‌తో సమస్య దాని మౌలిక భావన కాదు, దాని రూపకల్పనే అని చెప్పక తప్పదు భారతీయ జ్ఞాన వ్యవస్థల పరిశోధనకు ప్రభుత్వం నిర్దేశించిన విధానం భావనాత్మకంగా లోపభూయిష్టమైనది. దానికి సమగ్ర దృక్పథం కొరవడింది. పైగా పలు కుదింపులతో దాని పరిధి సంకుచితమయింది. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ప్రాచీనకాలపు అవశేషాలుగా పరిగణించడం మొట్టమొదటి పెద్ద కుదింపు. సజీవ, చైతన్యశీల భారతీయ జ్ఞాన సంప్రదాయాలు పురాతన యుగాలలో మాత్రమే వర్ధిల్లాయా? సుదూర గతంపైన మాత్రమే దృష్టి సారించడం రెండో కుదింపు. ముస్లిం, బ్రిటిష్ పాలనా యుగాలలో సమున్నతంగా జరిగిన మేధో కృషిని ఐకేఎస్ ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తోంది. జ్ఞాన వ్యవస్థలను కేవలం రాతపూర్వక గ్రంథాలకే పరిమితం చేయడం మూడో కుదింపు. వ్యవసాయం, నేత కార్మికులు, చేతి వృత్తుల వారి దైనందిన కార్యకలాపాలలో నిక్షిప్తమై ఉన్న ఆచరణాత్మక, నిగూఢ జ్ఞానాన్ని విస్మరించడం సమంజసం కాదు. గ్రామీణ సమాజాలలో నేటికీ ఆ జ్ఞాన సంప్రదాయాలు ప్రయోజనకరంగా వర్ధిల్లుతూనే ఉన్నాయి. వాటిని ఉపేక్షిస్తే నష్టం వాటిల్లేది ఎవరికి? ఐకేఎస్ పరిగణనలోకి తీసుకుంటున్న పురాతన గ్రంథాలు పూర్తిగా బ్రాహ్మణీయ మేధో సంప్రదాయానికి చెందినవే కావడం నాలుగో కుదింపు. ప్రాంతీయ, దేశీ సంప్రదాయాలను శోధించక పోవడం సరికాదు. భారతీయ జ్ఞాన వ్యవస్థలను ఆధునిక పాశ్చాత్య ప్రమాణాలు, దృక్కోణాల పరంగా మూల్యాంకనం చేయడం ఒక పెద్ద పొరపాటు. ఇది సత్యావిష్కరణకు ఎలా దోహదం చేస్తుంది సరే, ఇప్పుడు నేను తొలుత ప్రస్తావించిన రెండు కొత్త పుస్తకాల గురించి వివరంగా నివేదిస్తాను. వాటిలో మొదటిది 2025లో ప్రచురితమైన 'భారత్ కి సారస్వత్ సాధన'. భారతీయ మేధో సంప్రదాయాలతో మనం మమేకమయ్యే మార్గాన్ని ఇది నిర్దేశించింది. రచయిత రాధా వల్లభ్ త్రిపాఠి మన కాలపు ప్రముఖ సంస్కృత విద్వజ్ఞుడు. సంస్కృత భాషలోని వందకు పైగా సాహిత్య, తాత్విక ఉద్గ్రంథాలకు అనువాదాలు చేశారు, విపుల వ్యాఖ్యానాలు వెలయించారు. క్రీస్తుపూర్వం 1000 సంవత్సరం నుంచి క్రీ.శ. 20వ శతాబ్ది దాకా 19 మంది మహాకవులు, మహాదార్శనికుల మేధో కృషి గురించి విపులంగా వివరించిన పుస్తకమే 'భారత్ కి సారస్వత్ సాధన'. భారతదేశంలో జ్ఞానం, సాహిత్య సృష్టి ఎలా సాగిందో త్రిపాఠి నేటి పాఠకులకు సుబోధకం చేశారు. సమాజానికి మేధస్సును, నైతికతను అందించిన మహాకవులు, దార్శనికుల రచనల పాధాన్యాన్ని, వర్తమాన ప్రాసంగికతను వివరించారు. ఈ క్రమంలో కొన్ని ఇబ్బందికరమైన సత్యాలను కప్పిపుచ్చేందుకు ఆయన ప్రయత్నించలేదు. ఇది గమనార్హం, ప్రశంసనీయం. పాశ్చాత్య సంస్కృత విద్వాంసులను గౌరవిస్తూనే వారి మేధా కృషిని నిశితంగా పరిశీలించారు. తన అభిప్రాయాలను నిష్కర్షగా తెలిపారు. భారతీయ జ్ఞానసంప్రదాయాల పట్ల తన ప్రగాఢ అభిమానాన్ని వ్యక్తం చేస్తూనే ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న ఐకేఎస్ ప్రాజెక్టులో భాగమయ్యేందుకు ఆయన నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. రెండో పుస్తకం 'అల్లమ ప్రభు అండ్ శైవ ఇమాజినేషన్'. ఇది కూడా 2025లోనే ప్రచురితమైనది. భారతీయ మేధా చరిత్రలో మరొక ముఖ్యభాగమైన బ్రాహ్మణేతర, సంస్కృత భాషాయేతర సంప్రదాయాలపై ఈ పుస్తకం దృష్టి నిలిపింది. రచయిత డీఆర్ నాగరాజ్ కన్నడ మేధావి. స్వతంత్ర భారతదేశంలో సమగ్ర సాంస్కృతిక విమర్శకులలో ఆయన అగ్రగణ్యుడు. నాగరాజ్ కన్నడంలో రాసిన ఆ పుస్తకం ఆయన మరణానంతరం 1999లో ప్రచురితమయింది. రెండున్నర దశాబ్దాల అనంతరం ఆ కన్నడ పుస్తకానికి ఎన్ఎస్ గండూర్ ఆంగ్లానువాదం వెలువడింది. 12వ శతాబ్ది వీరశైవ ఉద్యమంలో ప్రముఖ వచనకారుడు అయిన అల్లమ ప్రభు గురించిన పుస్తకమిది. కవిగా, తాత్వికుడుగా అల్లమ ప్రభు విశిష్టతను వివరించడంలో భారతీయ సాహిత్య తత్వశాస్త్ర చరిత్ర రచనా రీతులు అట్టడుగు వర్గాల వారి ఆలోచనా శైలులను విస్మరించడాన్ని నాగరాజ్ విమర్శించారు. భావ చిత్రాలు, రూపకాలంకారాలతో అల్లమ ప్రభు మొదలైన అణగారిన వర్గాల విద్వజ్ఞుల విశిష్ట దేశీయ కల్పనా ప్రతిభను సంప్రదాయ పండితులు గుర్తించలేదని నాగరాజ్ నిక్కచ్చిగా చెప్పారు. పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాన్ని కాకుండా కశ్మీర్ తాత్వికుడు అభినవగుప్త శైవ మీమాంస సంప్రదాయాల ఆధారంగా అల్లమ ప్రభు వచనాలను నాగరాజ్ పరిశీలించి వాటికి వినూత్న భాష్యాలు చెప్పారు. త్రిపాఠి, నాగరాజ్‌ల పుస్తకాలలో సువ్యక్తమైన దృక్పథంతో భారతీయ జ్ఞాన వ్యవస్థలను మనం శోధించవలసిన అవసరమున్నది. సమ్మిళిత, దూర దృష్టితో కూడిన విధానం మన అధ్యయనాలకు ప్రాతిపదిక కావాలి. అవి భవిష్యత్ ఆధారంగా జరగాలి. పురాతన యుగాల గ్రంథాలలో ఆధునిక విజ్ఞానశాస్త్ర ఆవిష్కరణల ఆనవాళ్ల అన్వేషణకు స్వస్తి చెప్పాలి. ఆ చారిత్రక జ్ఞానసంచయాన్ని వర్తమాన సమాజాల సమస్యలను పరిష్కరించేందుకు వివేకశీలంగా ఉపయోగించుకోవాలి. ఈ శోధనలు చరిత్రలో ఏదో ఒక దశకు మాత్రమే పరిమితం కాకూడదు అలాగే గ్రంథగత బ్రాహ్మణీయ జ్ఞానానికి మాత్రమే ప్రాధాన్యమివ్వకూడదు. స్థానిక చేతివృత్తులు, మౌఖిక సంప్రదాయాలు, పురాతన రోగ నిదాన పద్ధతులను నిశితంగా పరిశీలించి ఈ నాటి జ్ఞానవాహినులతో సమన్వయపరచాలి. ఇటువంటి విశాల దృక్పథాన్ని అనుసరించినప్పుడే అన్నీ వేదాల్లో ఉన్నాయన్న అహేతుక వైఖరిని విడనాడగలుగుతాము. అవిద్యావంతులు, వెనుకబడిన సామాజికులుగా మనం భావిస్తున్న రైతులు, చేతివృత్తుల నిపుణులను జ్ఞాన నిర్మాతలుగా, భారతీయ జ్ఞాన వ్యవస్థల వాహకులుగా గుర్తించి గౌరవించే ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని నెలకొల్పగలుగుతాము.

# శేరిలింగంపల్లిలో ట్రాఫిక్ విముక్తి

-శేరిలింగంపల్లి, ఎల్లమ్మబండలో 100 ఫీట్ రోడ్డు విస్తరణకు వేగం..
-ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం : ఆరెకపూడి గాంధీ..
-అడ్డంకుల తొలగింపుతో యుద్ధప్రాతిపదికన పనులు..
-నాణ్యతలో రాజీ లేదు..ప్రజలకు త్వరలో ఉపశమనం..



ఆల్విన్ కాలనీ, మే 21 ( హంసకలం వార్త )

ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో ఉషముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు వయా ఎల్లమ్మబండ ప్రధాన రహదారిపై జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జలమండలి, సిఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ట్రాఫిక్ సమస్యల నివారణకు చేపట్టిన ఈ రోడ్డు విస్తరణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఉషముళ్లపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ రహదారిపై రోజురోజుకూ ట్రాఫిక్ తీవ్రత పెరిగిపో తోందని, ప్రజలు గంటల తరబడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారంగా 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. గతంలో అధికారులతో కలిసి ఉషముళ్లపూడి కమాన్ నుంచి సిక్కుల బస్తీ వరకు పాదయాత్ర నిర్వహించి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించిన విషయాన్ని గుర్తు చేశారు. రోడ్డు విస్తరణకు అడ్డంకిగా ఉన్న బండరాళ్లు, విద్యుత్ స్థంబాలు, ఇతర అవరోధాలను వెంటనే తొలగించాలని సూచించారు. రోడ్డు పనుల కారణంగా దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్‌ను తక్షణమే పునరుద్ధరించాలని జలమండలి అధికారులను ఆదేశించారు. పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, ఎక్కడా రాజీ పడొద్దని స్పష్టం చేశారు. ఎల్లమ్మబండ రహదారిలో డివైడర్ మధ్య సుందరీకరణ పనులు చేపట్టాలని, వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. 100 ఫీట్ రోడ్డు విస్తరణ పూర్తయితే ప్రజలకు సమయం, ఇంధనం ఆదా అవుతుందని తెలిపారు. ట్రాఫిక్ రహిత, సౌకర్యవంతమైన రవాణా కోసం తాను శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే తన లక్ష్యమని ఆరెకపూడి గాంధీ పునరుద్ఘాటించారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జలమండలి డీజీఎం శ్రీనివాస రాజు, సిఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ మౌనిక, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, జిల్లా గణేష్, మారేళ్ల శ్రీనివాస్, ఎండీ ఇబ్రహీం, కాజా, కాలనీ వాసులు పాల్గొన్నారు..

# సెంట్రింగ్ కార్మికులకు మాధవరం భరోసా


-సెంట్రింగ్ కార్మికులకు బీమా కల్పించాలి..
-కార్మికులకు బీఆర్ఎస్ అండగా.. మాధవరం కృష్ణారావు..



కూకట్‌పల్లి, మే 21 ( హంసకలం వార్త )

గ్రేటర్ హైదరాబాద్ భవన నిర్మాణ సెంట్రింగ్ కాంట్రాక్టర్లు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చేపడుతున్న నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మద్దతు తెలిపారు. గురువారం కూకట్‌పల్లి ఏవీబీపురంలోని సెంట్రింగ్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని కార్మికులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో సెంట్రింగ్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి కార్మికులు సమస్యల్లో చిక్కుకున్నప్పుడు ప్రభుత్వం అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు. నిర్మాణ పనుల సమయంలో ప్రమాదాలు చోటుచేసుకుంటే నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారికి బీమా సౌకర్యం కల్పించి భరోసా ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అక్రమ నిర్మాణాల పేరుతో అధికారులు సెంట్రింగ్ సామాగ్రిని ధ్వంసం చేయడం, సామాగ్రికి భద్రత లేకపోవడం కార్మికుల్లో ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక శాఖ నుంచి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు గుర్తింపు కార్డు లేకపోయినా పోలీసు ఫిర్యాదును ప్రామాణికంగా పరిగణించి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. సెంట్రింగ్ కార్మికుల సమస్యలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, భారత రాష్ట్ర సమితి పార్టీ తరఫున కార్మికులకు అండగా నిలుస్తామని మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు.

# రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



బాలానగర్, మే 21 ( హంసకలం వార్త )

దేశ సమగ్రత, సాంకేతిక విప్లవానికి పునాదులు వేసిన భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని బాలానగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. బాలానగర్ ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ 21వ శతాబ్దపు భారత నిర్మాణానికి రాజీవ్ గాంధీ బాటలు వేసిన దార్శనిక నాయకుడని కొనియాడారు. యువతకు 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం చేయడం, టెలికాం, కంప్యూటర్ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురావడం రాజీవ్ గాంధీ దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. దేశ ఐక్యత కోసం ప్రాణత్యాగం చేసిన మహానేత ఆశయ సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, సభ్యులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి ఘన నివాళులు అర్పించారు..

# ఈజీ మనీ ఆశ..జైలు దారి

-మ్యూల్ అకౌంట్ల మాఫియా గుట్టురట్టు..
-సైబర్ మోసాలకు బ్యాంక్ ఖాతాల సరఫరా..
-డెలివరీ బాయ్ అరెస్ట్.. లక్షల సీజ్..
-కమిషన్ ఆశతో సైబర్ ఉచ్చులో యువత..




సైబరాబాద్, మే 21 ( హంసకలం వార్త )

సైబర్ క్రైమ్ యూనిట్, ఎస్‌వోటీ సైబరాబాద్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో సైబర్ మోసాలకు మ్యూల్ బ్యాంక్ అకౌంట్లు సరఫరా చేస్తున్న దిలీప్ సింగ్‌ను అరెస్ట్ చేశారు. ట్రేడింగ్ ఫ్రాడ్‌లు, డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఆన్‌లైన్ గేమింగ్, పార్ట్‌టైమ్ జాబ్ స్కామ్‌లు, ఫేక్ ఇన్వెస్ట్మెంట్ మోసాలకు ఈ అకౌంట్లు వినియోగిస్తున్నట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. అపురూప కాలనీ, ఐడీఏ జీడిమెట్లకు చెందిన దిలీప్ సింగ్ రాపిడో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ అకౌంట్లు సమకూర్చినట్లు పోలీసులు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన జోర్డాన్, పింటూ భయ్యా పేరుతో పరిచయమైన వ్యక్తులు సోషల్ మీడియా ద్వారా కమిషన్ ఆఫర్ చేయడంతో ఈ అక్రమ వ్యవహారంలో చేరినట్లు దర్యాప్తులో తేలింది. సేవింగ్స్ అకౌంట్‌కు రూ.25 వేల నుంచి, కరెంట్ అకౌంట్‌కు రూ.50 వేల వరకు కమిషన్ ఇస్తామని ఆశ చూపించి అకౌంట్లు సేకరించినట్లు గుర్తించారు. నిందితుడు తన పేరుతో పాటు ఇతరుల బ్యాంక్ అకౌంట్లు, ఏటీఎం కార్డులు, సిమ్ కార్డులు, చెక్‌బుక్స్, పాస్‌బుక్స్, బ్యాంకింగ్ పత్రాలను సైబర్ ముఠాలకు అందజేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.1.02 లక్షల నగదు, మూడు మొబైల్ ఫోన్లు, 12 డెబిట్ కార్డులు, ఒక క్రెడిట్ కార్డు, మూడు పాస్‌బుక్స్, ఏడు చెక్‌బుక్స్ స్వాధీనం చేసుకున్నారు. అదనంగా వివిధ రాష్ట్రాలకు కొరియర్ చేసిన 33 బ్యాంక్ పాస్‌బుక్స్‌ను గుర్తించారు. కొంతమంది బ్యాంక్ ఉద్యోగులు కూడా అకౌంట్లు తెరవడంలో నిందితులకు సహకరించినట్లు ప్రాథమిక విచారణలో తేలిందని, ఆ కోణంలో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. ఈ కేసు కింద భారతీయ న్యాయ సంహిత, ఐటీ చట్టంలోని పలు సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ డబ్బు ఆశతో బ్యాంక్ అకౌంట్లు అద్దెకు ఇవ్వవద్దని సూచించారు. ఏటీఎం కార్డులు, ఓటీపీలు, సిమ్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ వివరాలు ఇతరులతో పంచుకుంటే నేర కేసుల్లో ఇరుక్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రత్యేకంగా విద్యార్థులు, నిరుద్యోగ యువకులు, డెలివరీ బాయ్స్, గిగ్ వర్కర్లు సోషల్ మీడియాలో వచ్చే ఈజీ మనీ కమిషన్ అకౌంట్ ప్రకటనలకు మోసపోవద్దని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు..

# లక్ష్మీ గణపతి ఆలయానికి కొత్త శోభ

-కేపీహెచ్‌బీలో ఆధ్యాత్మిక సందడి



కేపీహెచ్‌బీ, మే 21 ( హంసకలం వార్త )

కేపీహెచ్‌బీ ఫేజ్-3లోని లక్ష్మీ గణపతి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగింది. ఆలయ కమిటీ సభ్యుడు జనగాం సురేష్ రెడ్డి ఆహ్వానం మేరకు కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆలయాన్ని సందర్శించి లక్ష్మీ గణపతి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో వేద మంత్రోచ్చారణల నడుమ జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావుకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన ఆయన, ఆలయ నిర్మాణ పనులు వేగంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. భక్తుల సహకారంతో ఆలయ అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని తెలిపారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, సంస్కృతి పరంపరలను కాపాడటం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఆలయాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత అభివృద్ధి చేసేందుకు కమిటీ సభ్యులు కృషి చేస్తున్నారని ఆయన అభినందించారు. భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించే దిశగా ఆలయ కమిటీ తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జయచంద్ర రెడ్డి, రఘురాం, శివశంకర్, రామకృష్ణ రెడ్డి తదితరులు పాల్గొని ఆలయ అభివృద్ధికి తమ మద్దతు ప్రకటించారు. ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావాలని భక్తులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు..

## ఇందిరా మహిళా శక్తి భవనం తుది దశ పనులను పరిశీలించిన కలెక్టర్




నిజామాబాద్, మే 21 ( హంసకలం వార్త )

నిజామాబాద్ నగరంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలో అధునాతన హంగులతో నూతనంగా నిర్మించిన ఇందిరా మహిళా శక్తి భవన సముదాయంను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం సందర్శించారు. తుది దశకు చేరుకున్న నిర్మాణ పనులను, వాటి నాణ్యతను పరిశీలించారు. చివరి దశలో ఉన్న పనులను సైతం వేగవంతంగా పూర్తి చేయించాలని, జూన్ 02వ తేదీ లోపు భవన సముదాయాన్ని సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరా మహిళా శక్తి భవనం చుట్టూ ప్రహారీ గోడ నిర్మించాలని సూచించారు. తుది దశ పనులను కూడా నాణ్యతతో పూర్తి చేయించి, సకాలంలో అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు శిక్షణ, ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఈ భవనం దోహదపడనున్నందున ఎలాంటి సౌకర్యాలకు తావు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓసాయన్న, జిల్లా పంచాయతీరాజ్ అధికారి బావయ్య, ఈ.ఈ వీరానంద్, మెప్మా ఏపీడీ మధుసూదన్ తదితరులు ఉన్నారు.

## జన గణన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్



( హంసకలం వార్త ) నిజామాబాద్, మే 21 :

జన గణనలో భాగంగా నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ ప్రక్రియను కలెక్టర్ ఇలా త్రిపాఠి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గంగస్థాన్ ఫేజ్ -1 లో పద్మజ అనే మహిళ ఇంటిని సందర్శించి, హౌస్ లిస్టింగ్ నిర్వహిస్తున్న తీరును కలెక్టర్ నిశితంగా పరిశీలన జరిపారు. ఎన్యూమరేటర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిని భారతికి సంబంధించిన గుర్తింపు కార్డును తనిఖీ చేశారు. జన గణన కోసం వెళ్లే సందర్భంలో ప్రతి ఎన్యూమరేటర్ క్యూ.ఆర్ కోడ్ తో జారీ చేయబడిన ఐ.డీ కార్డును తప్పనిసరిగా ధరించాలని ఈ సందర్భంగా కలెక్టర్ స్పష్టం చేశారు. ఇంటి యజమానులు, కుటుంబ సభ్యులలో ఎవరైనా సరే తమ ఇళ్లకు జన గణన కోసం వచ్చే ఎన్యూమరేటర్ ఐ.డీ కార్డును పరిశీలించిన తరువాతే అనుమతించాలని కలెక్టర్ సూచించారు. కాగా, వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఉదయం, సాయంత్రం వేళల్లో జన గణన ప్రక్రియను పొరపాట్లకు తావు లేకుండా వేగంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎన్యూమరేటర్లకు, సూపర్వైజర్లకు సూచించారు. సెన్సస్ ప్రక్రియ ఎంతో ప్రాధాన్యతతో కూడుకుని ఉన్నందున ఏ ఒక్క ఇల్లు కూడా తప్పిపోకుండా జాగ్రత్తగా జన గణన జరపాలని అన్నారు. సమయ పాలన పాటిస్తూ, ఇంటింటి సందర్శన సమయంలో ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని అన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, నగర పాలక సంస్థ ఈ.ఈ శ్రీకాంత్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్ తదితరులు ఉన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

**రైతులకు ఇబ్బంది కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి**

**జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



( హంసకలం వార్త ) మే 21జగిత్యాల:

జిల్లాలో వరి ధాన్యం కొనుగోళ్ల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణలో భాగంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలంలోని కలికోట, అంబారి పేట, తాండ్రియాల, గంబీర్ పూర్ గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా పరిశీలించారు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన వరి ధాన్యాన్ని మ్యాచర్ వచ్చిన వెంటనే ఆలస్యం లేకుండా తూకం వేసి మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ మరియు రవాణా ప్రక్రియల్లో ఎటువంటి నిర్లక్ష్యం ఉండకూడదని, రైతులకు సమగ్ర సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే డాటా ఎంట్రీ ఆన్లైన్ చేసి రైతులకు ఖాతాలో డబ్బులు జమ అయ్యే విధంగా చుడాలని అన్నారు. మిల్లుల వద్ద త్వరగా అన్లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. రైతులు విక్రయించిన ధాన్యం సకాలంలో మిల్లులకు చేరేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి , డి సి ఓ మనోజ్ కుమార్, తహసీల్దార్ లు , సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం

**-యువత రాజకీయాలకు రాజీవ్ గాంధీ కొత్త దిశ..**

**- రాజీవ్ గాంధీ సేవలు దేశానికి చిరస్మరణీయం..**

**-ఐటీ, టెలికాం విప్లవానికి రాజీవ్ గాంధీ పునాదులు..**

**-మదీనాగూడలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం..**

మదీనాగూడ, మే 21 ( హంసకలం వార్త )

భారత యువతకు రాజకీయాల్లో కొత్త దిశ చూపించిన మహానేత, ఆధునిక భారత నిర్మాణ శిల్పి, మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. జగదీశ్వర్ గౌడ్ ఘన నివాళులు అర్పించారు. మదీనాగూడ డివిజన్ పరిధిలోని హుడా కేఫ్ సమీపంలో రవి కుమార్ నాయీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ నాయకులు, ప్రజలతో కలిసి రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మియాపూర్ యువనాయకుడు, యలమంచి ఉదయ్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వి. జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ దేశ అభివృద్ధికి రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. యువతకు రాజకీయాల్లో అవకాశాలు కల్పించేందుకు ఓటు హక్కు వయస్సును 18 సంవత్సరాలకు తగ్గించడం, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం, టెలికాం, ఐటీ రంగాలకు పునాదులు వేయడం, కంప్యూటరీకరణకు శ్రీకారం చుట్టడం వంటి నిర్ణయాలు దేశ భవిష్యత్తును మలిచాయని పేర్కొన్నారు. మహిళా సాధికారత, సమ్మిళిత విద్య, సార్వత్రిక రోగనిరోధక కార్యక్రమాలు, శాంతి ఒప్పందాల అమలు వంటి సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ రఘునందన్ రెడ్డి, డివిజన్



అధ్యక్షులు అలీ, బాష్పాక యాదగిరి, నగేష్ నాయక్, నాగేశ్వర్ రావు, శేఖర్ ముదిరాజ్, రవీందర్ రెడ్డి, కావూరి ప్రసాద్, మన్నేపల్లి సాంబశివ రావు, ప్రభాకర్ రెడ్డి, కనకమామిడి నరేందర్ గౌడ్, రాములు గౌడ్, నర్సింహ గౌడ్, మిరియాల ప్రీతం, రాజేష్, శివ కుమార్, విష్ణు, పద్మారావు, సౌందర్య రాజన్, నర్సింగ్ రావు, వెంకట్ రెడ్డి, సాదిక్, జావేద్, రామచందర్ గౌడ్, నరేందర్ ముదిరాజ్, గోపాల్ నాయక్, శంకర్ గౌడ్, చిన్న, కార్తీక్ గౌడ్, రిజ్వాన్, అలీ, మహిళా కాంగ్రెస్ నాయకులు అనిత, జయ, శాంత పాల్గొన్నారు..

# ఇంటింటి సర్వే పారదర్శకంగా జరగాలి

**-జనగణనలో ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా నమోదు చేయాలి**

**-మే 11 నుంచి జూన్ 9 వరకు ఇళ్ల గణన**

**-జనగణన ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

( హంసకలం వార్త ) మే21 నాగర్ కర్నూ:

గురువారం ఉదయం నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండల కేంద్రంలో కొనసాగుతున్న జనగణన ఇండ్ల గణన ప్రక్రియని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి సిబ్బంది సేకరిస్తున్న వివరాలను తనిఖీ చేసి, ప్రతి కుటుంబానికి సంబంధించిన సమాచారం ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. జనగణనలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా ప్రక్రియ కొనసాగించాలని, ప్రజలు కూడా అధికారులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎన్యూమరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ ఇంటింటి సర్వే సక్రమంగా, పారదర్శకంగా జరిగేలా చూడటం ఎన్యుమరేటర్ల ప్రధాన బాధ్యత అని తెలిపారు. జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని,



నిర్దేశిత నిబంధనల ప్రకారం మొబైల్ యాప్ ద్వారా స్పష్టమైన, కచ్చితమైన వివరాలను సేకరించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలు గ్రామ స్థాయిలో సమర్థవంతంగా జరగాలని, ప్రజలకు నాణ్యమైన సేవలు అందేలా అధికారులు కట్టుదిట్టంగా పని చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు. మొదటి దశలో మే 11వ తేదీ నుంచి జూన్ 9వ తేదీ వరకు ఇళ్ల గణన నిర్వహిస్తారని, ప్రతి కుటుంబం వివరాలు పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. జనగణన సిబ్బంది ప్రజలు అందించిన వివరాలను మాత్రమే నమోదు చేయాలని, ఇతర వివరాల స్వీకరణను చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఎన్యూమరేటర్లు అడిగే ప్రశ్నలకు ఎలాంటి దాపరికం లేకుండా ఖచ్చి తమైన సమాధానాలు చెప్పాలని, దీనివల్ల ప్రభుత్వానికి సరైన లెక్కలు అందుతాయన్నారు.

# వామ్మో ఏం ఎండలురా బాబోయ్

నిజామాబాద్, మే 21 ( హంసకలం వార్త )

తెలుగు రాష్ట్రాలను ప్రచండ భానుడు దహించివేస్తున్నాడు. ఇది వేసవి కాలం కాదు,ప్రకృతి మానవాళికి జారీ చేస్తున్న తుది హెచ్చరిక. ఉదయం తొమ్మిది గంటలకే ఉష్ణోగ్రతలు నలభై డిగ్రీలు దాటి మండిపోతుండగా,మధ్యాహ్నానికి ఆ మంట నలభై ఏడు డిగ్రీలకు చేరుకుని రోడ్లను నిప్పుల కొలిమిలా మారుస్తోంది. తారు రోడ్లు కరిగి కాళ్లకు అంటుకుంటుంటే, ఇళ్లలో గోడలు సైతం సెగలు కక్కుతున్నాయి. ఇది భయపెట్టడానికి చెబుతున్న మాట కాదు, గడిచిన వారం రోజుల చేదు వాస్తవం. కేవలం వడదెబ్బ కారణంగానే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఇరవై మూడు మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. వందల సంఖ్యలో ప్రజలు ఆసుపత్రుల్లో మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ భయానక పరిస్థితుల్లో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులు,దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడేవారు బయటకు అడుగుపెడితే క్షేమంగా తిరిగి ఇంటికి చేరతారనే భరోసా లేకుండా పోయింది. వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే రెడ్ అలర్ట్ ప్రకటించి, ఉదయం పదకొండు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని కఠినంగా హెచ్చరిస్తోంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తలకు టోపీ,కళ్లకు కూలింగ్ గ్లాసెస్ ధరించి,వెంట మంచినీటి సీసా తీసుకెళ్లడం ప్రాణాలకు రక్షణ కవచం లాంటిది. లేకుంటే వడగాల్పులు పది నిమిషాల్లోనే మనిషిని కుప్పకూల్చే ప్రమాదం పొంచి ఉంది. గ్రామాల్లో పరిస్థితి వర్ణించడానికి మాటలు చాలవు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో బోర్లు ఎండిపోయాయి, చెరువులు నీటి చుక్క లేక బీడువారాయి. తాగడానికి గుక్కెడు నీళ్లు దొరకని దుస్థితి నెలకొంది. పశువులు దాహంతో రాలిపోతుండగా, పొలం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. రోజువారీ కూలీపై ఆధారపడి బతికే పేదవాడు ఇప్పుడు ఎండకు చావాలా,ఆకలికి చావాలా అనే దీనావస్థలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇక పట్టణాల పరిస్థితి మరో రకం నరకం. కాంక్రీట్ భవనాలు,తారు రోడ్లు పగటిపూట గ్రహించిన వేడిని రాత్రంతా వెదజల్లుతుండటంతో నగరాలు ఉడికి పోతున్నాయి. ఇళ్లలో ఏసీలు,కూలర్లు కూడా వేడి గాలినే చిమ్ముతూ నిస్సహాయంగా నిలబడి పోతున్నాయి. విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగి పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్లు పేలి కాలనీలకు కాలనీలే అంధకారంలో మగ్గిపోతున్నాయి. వడదెబ్బను ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా అది కాటేసే నాగుపాము కంటే ప్రమాదకరం. విపరీతమైన తలనొప్పి,కళ్లు తిరగడం,చర్మం పొడిబారి చెమట పట్టకపోవడం, వాంతులు కావడం,స్పృహ తప్పడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే బాధితుడిని నీడకు చేర్చి,శరీరంపై నీళ్లు చల్లుతూ వెంటనే 108కు సమాచారం అందించాలి. వడదెబ్బ తగిలిన అరగంటలోపు సరైన వైద్యం అందకపోతే మెదడు దెబ్బతిని,కిడ్నీలు పనిచేయక, గుండెపోటు వచ్చి మనిషి ప్రాణాలు గాల్లో కలిసిపోతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. పర్యావరణ నిపుణులు ఈ దుస్థితికి మానవ తప్పిదాలే కారణమని కుండబద్దలు కొడుతున్నారు. నగరీకరణ పేరుతో విచ్చలవిడిగా చెట్లను నరికివేయడం, కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలను అడ్డూ అదుపూ లేకుండా అనుమతించడం,ఏసీల వాడకంతో ఓజోన్ పొరకు చిల్లులు పెట్టడం వంటి చర్యల వల్లనే భూమి ఇప్పుడు మానవాళిపై పగబట్టిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న పది రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి యాభై డిగ్రీల మార్కును తాకే ప్రమాదం ఉంది. ఇది మానవ శరీరం తట్టుకోగలిగే చివరి పరిమితి అని శాస్త్రవేత్తలు తేల్చి చెబుతున్నారు. ఒకప్పుడు వేసవి కాలం అంటే పిల్లలకు సెలవులు, మామిడి పండ్ల రుచులు,ఆటాపాటలు గుర్తుకొచ్చేవి. కానీ,నేడు వేసవి అంటే యమపాశంలా మారింది.




ప్రతి ఇంట్లోనూ ప్రాణాలను కాపాడుకోవడం కోసం ఒక అఘోషిత లాక్‌డౌన్‌ను పాటిస్తున్నారు. దాహం వేసే వరకు ఆగకుండా ప్రతి ఇరవై నిమిషాలకు ఒకసారి నీళ్లు తాగడం,మజ్జిగ, కొబ్బరినీళ్లు,ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం, కూల్‌డ్రింక్స్, మద్యానికి పూర్తిగా దూరంగా ఉండటం ప్రస్తుతానికి శ్రీరామరక్ష. అంతేకాదు, చిన్నపిల్లలను, వృద్ధులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఒంటరిగా వదలవద్దు. కారులో లేదా గదిలో వారిని లాక్ చేసి వెళ్లడం నేరుగా మృత్యువుకు ఆహ్వానం పంపడమే అవుతుంది. రోడ్డుపై ఎవరైనా వడదెబ్బకు గురై పడిపోతే చలించిపోకుండా ఆదుకోండి. మీరు చేసే ఐదు నిమిషాల సహాయం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుంది. ఇది సాధారణ ఎండ కాదు,వాతావరణం మానవుడిపై ప్రకటించిన యుద్ధం. ఈ యుద్ధంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మనమే బలైపోతాం. కాబట్టి ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి. మీ ప్రాణం,మీ కుటుంబ సభ్యుల ప్రాణాలు మీ చేతుల్లోనే ఉన్నాయని గుర్తుంచుకోండి.

# ధరణి' తెచ్చిన తిప్పలు తప్పిస్తాం అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

-నాడు దొరల గడీల్లో బందీ అయిన భూ రికార్డులు.. నేడు పేదల చేతుల్లోకి పట్టాలు

-రాష్ట్రాన్ని రూ.8.18 లక్షల కోట్ల అప్పుల్లో ముంచినా.. సంక్షేమానికి వెనకడుగు వేయం

-ఎన్నికల నాటి 'బొమ్మల ఇళ్ల' నాటకాలకు చెక్.. రూపాయి లంచం లేకుండా నేరుగా ఖాతాల్లోకే నగదు..

-సత్తుపల్లి ప్రజా దర్బార్‌లో గత పాలకుల దగాపై రెవెన్యూ మంత్రి పొంగులేటి నిప్పులు..



( హంసకలం వార్త ) మే 21 ఖమ్మం

సత్తుపల్లి : "గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలు, ధరణి పోర్టల్‌లోని లోపాల వల్ల పేదలు, రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు గడీల పెత్తనంలో బందీ అయిన భూ రికార్డులను విడిపించి, భూములపై పేదలకే సర్వాధికారాలు కల్పిస్తాం" అని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. గురువారం సత్తుపల్లిలోని ఎంఆర్ గార్డెన్స్ లో స్థానిక శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ఆధ్వర్యంలో పెనుబల్లి, వేంసూరు, సత్తుపల్లి మండలాలకు సంబంధించిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక – ప్రజా దర్బార్' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి.. వందలాదిగా తరలివచ్చిన ప్రజల నుంచి స్వయంగా వినతులు స్వీకరించి, గత ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

-నాడు కాగితాల మోసం.. నేడు అకౌంట్లలోకి కాసులు..

ధనిక తెలంగాణ రాష్ట్రాన్ని గత పాలకులు అడ్డగోలుగా రూ.8 లక్షల 18 వేల కోట్ల అప్పుల కుప్పగా మార్చారని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. "అప్పులు ఉన్నాయని నెపంతో మేము చేతులు ముడుచుకుని కూర్చోలేదు. ఉన్న వనరులతోనే పేదవాడికి భద్రత, భరోసా కల్పిస్తున్నాం. గత పాలకుల కాలంలో ఎన్నికలు రాగానే ఇందిరమ్మ ఇళ్ల పేరుతో బొమ్మలు చూపించి ఒట్టి కాగితాలకే పరిమితం చేశారు. కానీ మా ప్రభుత్వం వచ్చిన మొదటి ఏడాదిలోనే రూ.22,500 కోట్లతో నాలుగున్నర లక్షల ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికే 1.25 లక్షల ఇళ్లు పూర్తి కాగా, జూన్ నాటికి మరో లక్ష ఇళ్లు సిద్ధమవుతాయి. వచ్చే జూన్ 2వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీని ఘనంగా ప్రారంభిస్తున్నాం" అని ప్రకటించారు. హైదరాబాద్‌లో బటన్ నొక్కితే ఒక్క రూపాయి లంచం లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే ప్రతి సోమవారం నిధులు జమ చేస్తున్నామన్నారు. ఇళ్లు కట్టుకునే పేదలకు ములకలపల్లి క్వారీ నుంచి నాణ్యమైన ఇసుకను ఉచితంగా అందిస్తామని చెప్పారు. గత పాలకుల హయాంలో నిరుద్యోగులను రోడ్డున పడేస్తే.. తమ ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్లలోనే 72,000 ఉద్యోగాలు భర్తీ చేశామని, త్వరలోనే మరో కొత్త కొలువుల ప్రకటన రాబోతుందని తెలిపారు.

-కాలపరిమితి లోగా భూముల కొలతలు.. పహానీల్లో పేర్లు

సత్తుపల్లి పట్టణ పరిధిలోని 399 సర్వే నంబర్ అంశంతో పాటు, చుట్టుపక్కల 9 గ్రామాల్లో ఉన్న దాదాపు 6,500 ఎకరాల భూ సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించారు. పేదపల్లి, నారాయణపురం పరిసరాల్లోని 5,500 ఎకరాల పైచిలుకు భూములను క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో కొలతలు (సర్వే) చేపట్టి, స్వాధీనంలో ఉన్న అర్హులైన రైతులందరికీ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని, పహానీలలో వారి పేర్లు ఎక్కించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ వేగంగా పూర్తి కావడానికి రైతులు, స్థానికులు అధికారులకు సహకరించాలని కోరారు. పాత ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిధుల బకాయిలు, ఇతర పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చామని, ఒకట్రెండు రోజుల్లోనే ఫలితాలు వస్తాయని చెప్పారు.

-అటవీ అడ్డంకులు వద్దు.. రైతులకు పూర్తి రక్షణ.

రుద్రాక్షపల్లి, కొకపాడు, తాళపెంట, రామచంద్రాపురం, వెంకటగిరి సహా సరిహద్దుల్లోని 10-12 గ్రామాల్లో నెలకొన్న అటవీ-రెవెన్యూ భూముల వివాదాలపై మంత్రి కఠిన ఆదేశాలు జారీ చేశారు. "ఈ వర్షాకాలం ప్రారంభం అయ్యేలోపే అటవీ సరిహద్దులను కొలిచి తేల్చాలి. మిగిలిన రెవెన్యూ భూమిలో తరతరాలుగా సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇచ్చే బాధ్యత నాదే" అని మంత్రి భరోసా ఇచ్చారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం పట్టాలు పొందిన రైతులు సాగు కోసం బోర్లు వేసుకుంటుంటే అటవీ శాఖ అధికారులు ఎక్కడా అభ్యంతరాలు పెట్టవద్దని, జిల్లా అదనపు కలెక్టర్, ఉప కలెక్టర్లు ఈ వ్యవహారాలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

# రహదారులపై బైక్ స్టంట్లు చెస్తున్న యువకులను అరెస్ట్ చేసిన కూసుమంచి పోలీసులు

( హంసకలం వార్త ) మే 21 ఖమ్మం





సోషల్ మీడియాలో లైకులు, రీల్స్ కోసం అత్యుత్సాహం ప్రదర్శిస్తూ...బహిరంగ రహదారులపై ప్రాణాపాయం కలిగించే విధంగా బైక్ స్టంట్లు చేస్తూ..., మితిమీరిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఇద్దరు యువకులను ఖమ్మం టాస్క్ ఫోర్స్, కూసుమంచి ఎస్సై నాగరాజు అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ తెలిపారు. ఇటీవల కాలంలో ఖమ్మం నగరంతో పాటు, పరిసర ప్రాంతాల్లోని జాతీయ రహదారులపై ప్రమాదకర విన్యాసాలు చేసి ఇతరుల ప్రాణాలకు ముప్పు తెస్తున్న కుసుమంచి మండలం, పరికసింగారం గ్రామానికి చెందిన మాదవరుపు శివ రామకృష్ణ, (20 సం) కోక్య తండా కు చెందిన బానోత్ జశ్వంత్ (18సం)ను గురువారం కూసుమంచి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సోషల్ మీడియా పోస్టులపై పోలీస్ సోషల్ మీడియా బృందం నిశితంగా పరిశీలిస్తుందని, ఈ తరహా చర్యలకు పాల్పడే వారిపై పోలీసులు మోటారు వాహన చట్టం, పబ్లిక్ న్యూసెన్స్ కింద కఠిన సెక్షన్లతో కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. బహిరంగ రోడ్లపై బైక్ విన్యాసాలు చేయడం చట్టరీత్యా నేరమని, విన్యాసాలు స్టంట్లు చేసే యువకుల ప్రాణాల మీదికి తేవడమే కాకుండా, రోడ్డుపై వెళ్లే పాదచారులకు, ఇతర వాహనదారులకు తీవ్ర ప్రమాదకరంగా మారుతున్నరాని అన్నారు. ప్రదానంగా తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు బైక్‌లు ఇవ్వకూడదని, అదేవిధంగా పిల్లల రోజువారి కార్యకలాపాలను నిశితంగా గమనిస్తూ ఉండాలని, చట్టవరుద్ధమైన ప్రాణాపాయం కలిగించే ఇలాంటి పనులకు దూరం ఉండేలా కౌన్సిలింగ్ ఇవ్వాలని అన్నారు. అలాగే యువత ఇలాంటి సాహసాలకు పోయి ప్రాణాలను పోగొట్టుకోవద్దని సూచించారు. ప్రజల భద్రతకు భంగం కలిగించేలా ఎవరైనా వ్యవహరిస్తే, స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. మోటారు వాహన చట్టం ప్రకారం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, రేసింగ్ చేస్తే జైలు శిక్ష, భారీ జరిమానాలు పడే అవకాశం ఉందన్నారు.

# ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్



( హంసకలం వార్త ) మే 21 రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉపాధి హామీ పనులు చేయించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఊర చెరువులో జల సంచాయ్ – జన్ భాగిదారి కింద ఉపాధి హామీ పనులు కొనసాగుతుండగా గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు ఉపాధి హామీ కింద ఉపాధి హామీ కల్పించాలని సూచించారు.ప్రతి రోజూ 150 మంది పనికి వచ్చేలా చూడాలని ఆదేశించారు.పని చేసే చోట నీడ సదుపాయం తాగు నీరు,ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండాలని సూచించారు.నిరక్షరాస్య కూలీలు ఉల్లాస్ కింద చదువు నేర్చుకోవాలని పేర్కొన్నారు.రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులు సన్న వడ్లు సాగు చేయాలని పిలుపు నిచ్చారు.కొనుగోలు కేంద్రంలో తనిఖీ తంగళ్లపల్లి మండలకేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ తనిఖీ చేశారు.ఇప్పటి దాకా ధాన్యం ఎంత వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు ఎంత ఏ రైస్ మిల్లుకు తరలించారో ఆరా తీశారు.కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులు,గోదాములకు తరలించాలని,ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని సూచించారు. పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీసీఎస్ఓ బుచ్చిబాబు,జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, సహకార అధికారి రామకృష్ణ,సర్పంచ్ లక్ష్మీరాజం, ఎంపీడీఓ రమేష్, ఇంచార్జి తహసీల్దార్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం కొరకు స్థల పరిశీలన



( హంసకలం వార్త ) మే 21జగిత్యాల:

చలిగల్‌లో ఏర్పాటు చేయనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం స్థలాన్ని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, డైరెక్టర్ జనరల్ వాలంతరి అనితతో కలిసి పరిశీలించారు.

జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ మేరకు చల్ గల్ లో ఏర్పాటు చేయబోయే పాఠశాల నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికలు, విద్యార్థులకు కల్పించాల్సిన మౌలిక వసతులు, భవన నిర్మాణం, రహదారి సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా అన్ని వసతులతో ఆధునిక పాఠశాల నిర్మాణం చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం యంగ్ ఇంటిగ్రేటెడ్ స్కూల్, కేంద్రీయ విద్యాలయం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మేరకు ఈరోజు స్థల పరిశీలన చేయడం జరిగిందని చేపట్టనున్న పాఠశాల నిర్మాణానికి అవసరమైన అన్ని సదుపాయాలను సమగ్రంగా ప్రణాళికాబద్ధంగా అమలు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధు సూదన్, జగిత్యాల రూరల్ తహసీల్దార్ హకిమ్, సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మరియు తదితరులు పాల్గొన్నారు

# రాజీవ్ గాంధీ స్ఫూర్తితోనే తెలంగాణ అభివృద్ధి సీఎం రేవంత్ రెడ్డి

-ఆధునిక సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ



( హంసకలం వార్త ) మే 21

మాజీ ప్రధానమంత్రి, భారతరత్న రాజీవ్ గాంధీ స్ఫూర్తితో తెలంగాణలో అభివృద్ధి,సంక్షేమకార్యక్రమాల ను వేగంగా ముందుకు తీసుకెళ్తున్నా మని ముఖ్య మంత్రిరేవంత్ రెడ్డిఅన్నారు రాజీవ్ గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి నేడు ముఖ్యమంత్రి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 21వ శతాబ్దంలో దేశాన్ని కంప్యూటర్, టెలికాం రంగాల వైపు నడిపించి ఆధునిక సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన గొప్ప దార్శనికుడు రాజీవ్ గాంధీ అని కొనియాడారు. దేశ యువతను సాంకేతిక యుగానికి సన్నద్ధం చేసిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. మహాత్మగాంధీ, ఇందిరాగాంధీ లాంటి మహానాయకుల ఆశయాలతో పనిచేస్తూ దేశ సమగ్రత, ఐక్యత కోసం రాజీవ్ గాంధీ తన ప్రాణాలను అర్పించారని సీఎం స్మరించుకున్నారు. పరిపాలనలో మహిళలకు భాగస్వామ్యం కల్పించినప్పుడే దేశం పురోభివృద్ధి సాధిస్తుందని నమ్మిన రాజీవ్ గాంధీ, స్థానిక సంస్థల్లో మహిళా రిజర్వేషన్లు తీసుకువచ్చారని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే బాటలో ప్రస్తుత లోక్‌సభ, శాసనసభల్లో మహిళా రిజర్వేషన్లకు సంబంధించి ఎలాంటి చిక్కుముడులు లేకుండా పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించి బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీని డిమాండ్ చేశారు. ఇందిరాగాంధీ కుటుంబానికి తెలంగాణతో ఎంతో కాలంగా గొప్ప అనుబంధం ఉందని, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో సోనియా గాంధీ అత్యంత సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ అధికారిక నివాళి కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజీవ్ గాంధీకి అంజలి ఘటించారు. మే 21న దేశవ్యాప్తంగా రాజీవ్ గాంధీ వర్ధంతిని తీవ్రవాద వ్యతిరేక దినోత్సవంగా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలోనే గాంధీ భవన్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాలలో కాంగ్రెస్ శ్రేణులు విరివిగా సేవా కార్యక్రమాలు నిర్వహించాయి.

# బిజినెస్

### రుణాల రికవరీలో ఇష్టంవచ్చినట్టు మాట్లాడితే కుదరదు...

## ఆర్బీఐ కీలక ప్రతిపాదనలు

రుణాల రికరీకి సంబంధించి బ్యాంకులు, ఎన్బీఎఫ్సీలకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కఠిన నిబంధనలను ప్రతిపాదించింది. లోన్ల రికవరీ పేరుతో కస్టమర్లను వేధించే ఆర్థిక సంస్థలకు అడ్డుకట్ట వేసేందుకు కొత్త ప్రతిపాదనలతో ముందుకు వచ్చింది. ఈ మేరకు కండక్ట్ ఆఫ్ రెగ్యులేటెడ్ ఎంటిటీఎస్ ఇన్ రికవరీ ఆఫ్ లోన్స్ అండ్ ఎంగేజ్‌మెంట్ ఆఫ్ రికవరీ ఏజెంట్స్ పేరిట ముసాయిదా నిబంధనలను ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలపై మే 31వ తేదీ వరకు వాటాదారులు, ప్రజల అభిప్రాయాలను ఆర్బీఐ సేకరించనుంది. ఆ తర్వాత అక్టోబర్ 1వ తేదీ నుంచి ఈ నిబంధనలు అమల్లోకి రానున్నాయి. ఆర్బీఐ ప్రతిపాదనల్లో కీలక అంశాలు ఉన్నాయి. వ్యక్తిగత, కారు, హోమ్ లోన్లకు సంబంధించి రుణగ్రహీత సకాలంలో తిరిగి చెల్లింపులు చేయనప్పుడు మొబైల్ ఫోన్‌ను లాక్ చేయడం, దాని ఫీచర్లను నిలిపివేయడం వంటివి బ్యాంకులు చేయకూడదని ప్రతిపాదనల్లో పేర్కొంది. ఒకవేళ ఆ మొబైల్ ఫోన్ లేదా టాబ్లెట్లను కొనుగోలు చేయడానికి సదరు ఆర్థిక సంస్థ లోన్ ఇచ్చి ఉంటే అప్పుడు మాత్రమే ఫోన్ ఫీచర్లను నిలిపివేసే హక్కు బ్యాంకుకు ఉంటుందని స్పష్టం చేసింది. అది కూడా లోన్ బకాయిపడి 90 రోజులు గడువు దాటి ఉండాలి. కస్టమర్లకు నోటీసులు ఇచ్చినా స్పందించకుంటే అప్పుడు చర్యలు తీసుకోవచ్చని పేర్కొంది. ఫోన్ బ్లాక్ చేసినప్పటికీ ఇంటర్నెట్, ఇన్‌కమింగ్ కాల్స్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఎమర్జెన్సీ అలర్టులు నిలిపివేయవద్దని పేర్కొంది. ఒకవేళ కస్టమర్ తన బకాయిని చెల్లిస్తే గంటలోనే ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలి. ఆలస్యమైతే గంటకు రూ.250 చొప్పున బ్యాంకే తిరిగి రుణగ్రహీతకు పరిహారంగా చెల్లించాలని పేర్కొంది. లోన్ రికవరీ కోసం బ్యాంకు ఉద్యోగులు లేదా రికవరీ ఏజెంట్లు చేసే అన్ని కాల్స్ సమయం, నెంబర్లను రికార్డు చేయాలని ఆర్బీఐ ప్రతిపాదించింది. అలాగే వారు చేసే ఆడియో, టెక్స్ట్ సంభాషణలను భద్రపరచాలని బ్యాంకులకు సూచించింది. రుణాల వసూళ్ళలో లోన్ ఏజెంట్లు లేదా ఉద్యోగులు అసభ్యపదజాలం, బెదిరింపులకు దిగడం వంటివి చేయకూడదని పేర్కొంది. కస్టమర్ల వ్యక్తిగత విరాలు, ఆడియా లేదా వీడియో రికార్డులను సోషల్ మీడియాలో పెట్టడం, సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్య సందేశాలు పంపడం, కాల్స్ చేసి పదేపదే వేధించడం వంటివి చేయకూడదని ఆర్బీఐ ప్రతిపాదించింది.

## భారత్‌లో టాప్-10 బిలియనీర్లు వీరే!



అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ క్షీణించినప్పటికీ భారతీయ బిలియనీర్లు సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారు. ఫోర్బ్స్ ప్రపంచ బిలియనీర్ల జాబితా-2026 ప్రకారం.. భారత్ నుంచి రికార్డు స్థాయిలో 229 మంది ఈ లిస్ట్‌లో చోటు దక్కించుకున్నారు. వీరి మొత్తం ఆస్తి విలువ తొలిసారి లక్ష కోట్ల డాలర్ల మార్కును దాటడం విశేషం. ఈసారి రికార్డు స్థాయిలో 30 మంది కొత్తవారు ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చారు.

**తొలి 2 స్థానాల్లో అంబానీ, అదానీ**

భారత్‌లోనే కాకుండా ఆసియాలోనే అత్యంత ధనవంతుడిగా ముకేశ్ అంబానీ తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. 99.7 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన దేశంలోనే మొదటి స్థానంలో ఉండగా మౌలిక సదుపాయాల రంగ దిగ్గజం గౌతమ్ అదానీ 63.8 బిలియన్ డాలర్ల ఆస్తితో రెండో స్థానంలో నిలిచారు. దేశవ్యాప్తంగా ఏఐ మౌలిక సదుపాయాలను నిర్మించేందుకు ఈ రెండు గ్రూపులు కలిపి ఏకంగా 210 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు ప్రకటించాయి.

**మూడో స్థానంలో సావిత్రి జిందాల్**

ఓపీ జిందాల్ గ్రూప్ అధినేత్రి సావిత్రి జిందాల్ 39.1 బిలియన్ డాలర్ల సంపదతో దేశంలోనే అత్యంత ధనవంతురాలైన మహిళగా నిలిచారు. ఓవరాల్‌గా ఆమెకు మూడో స్థానం దక్కింది. కోటక్ మహీంద్రా బ్యాంక్ వ్యవస్థాపకుడు ఉదయ్ కోటక్ 14.4 బిలియన్ డాలర్ల ఆస్తితో పదో స్థానంలో నిలిచి ఈ టాప్ గ్రూపులోకి ప్రవేశించారు.

**యూట్యూబ్ క్లాస్ నుంచి బిలియనీర్స్ క్లబ్‌కు**

భారతీయ ఎడ్‌టెక్ రంగంలో ఈసారి సరికొత్త సంచలనం నమోదైంది. ప్రముఖ ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫామ్ 'ఫిజిక్స్ వాలా' కో-ఫౌండర్లు అలఖ్ పాండే, ప్రతీక్ బూబ్ ఈసారి బిలియనీర్ల జాబితాలో స్థానం సంపాదించారు. గత ఏడాది నవంబర్‌లో వచ్చిన తమ కంపెనీ ఐపీఓ సూపర్ హిట్ కావడంతో ఈ ఇద్దరు కుబేరుల క్లబ్‌లోకి అడుగుపెట్టారు.

**31 ఏళ్ల వయసులోనే కుబేరుడిగా**


ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో చోటు దక్కించుకున్న అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా అరవింద్ శ్రీనివాస్ (31) రికార్డు సృష్టించారు. జెఫ్ బెజోస్ మద్దతుతో నడుస్తున్న 'పెర్‌ప్లెక్సిటీ' ఏఐ సెర్చ్ స్టార్టప్ కో-ఫౌండర్ అయిన ఈయన శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉంటున్నారు. కొన్నేళ్ల విరామం తర్వాత 'పేటీఎమ్' వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్ శర్మ మళ్లీ బిలియనీర్ల జాబితాలోకి పునరాగమనం చేశారు. మరోవైపు 'ఓలా క్యాబ్స్' ఫౌండర్ భవీష్ అగర్వాల్‌తో పాటు మరో ఏడుగురు ఈసారి బిలియనీర్ల హోదాను కోల్పోయారు.

**టాప్-10 జాబితా**

ముకేశ్ అంబానీ - 99.7 బిలియన్ డాలర్లు, గౌతమ్ అదానీ - 63.8 బి.డా, సావిత్రి జిందాల్ - 39.1 బి.డా, లక్ష్మీ మిట్టల్ - 31.0 బి.డా, శివ్ నాడార్ - 30.9 బి.డా, సైరస్ పూనావాలా - 27.0 బి.డా, దిలీప్ సంఘ్వీ - 25.6 బి.డా, కుమార్ బిర్లా - 21.1 బి.డా, రాధాకిషన్ దమానీ - 15.7 బి.డా, ఉదయ్ కోటక్ - 14.4 బి.డా .

# స్పోర్ట్స్

## నా కెరీర్ ముగించడానికి అతడు అన్ని ప్రయత్నాలు చేశాడు: గుత్తా జ్వాల



భారత మాజీ బ్యాడ్మింటన్ స్టార్ జ్వాలా గుత్తా తన కెరీర్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది. సరైన మద్దతు లభించి, వివాదాలకు దూరంగా ఉండుంటే తాను ప్రపంచ నంబర్ వన్ అయ్యేదాన్నని ఆమె అభిప్రాయపడింది. అప్పటి బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) అధ్యక్షుడు వీకే వర్మ, ఇతర కోచ్‌లు తన కెరీర్‌ను దెబ్బతీయాలని చూశారని ఆమె తీవ్ర ఆరోపణలు చేసింది. ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. 2010 కామన్వెల్త్ గేమ్స్‌లో జరిగిన ఓ ఘటనను ఆమె గుర్తుచేసుకుంది. ఆ టోర్నీలో తాను, అశ్విని పొన్నప్ప డబుల్స్ స్వర్ణం గెలిచిన తర్వాత సైనా నెహ్వాల్ సింగిల్స్‌లో స్వర్ణం సాధించిందని తెలిపింది. "మేం స్వర్ణం గెలిచినప్పుడు వీకే వర్మ పట్టించుకోలేదు. కానీ, రెండు గంటల తర్వాత సైనా గెలవగానే అతడు కోర్టులోకి పరుగెత్తుకెళ్లి సంబరాలు చేసుకున్నాడు. మా స్వర్ణం తక్కువేమీ కాదు కదా? అని ఆనాడే ప్రశ్నించాను" అని జ్వాలా వివరించింది. వీకే వర్మ తన కెరీర్‌ను ముగించేందుకు తీవ్రంగా ప్రయత్నించాడని జ్వాలా ఆరోపించింది. "2006లో ఎలాంటి కారణం చెప్పకుండా నన్ను జట్టు నుంచి తొలగించారు. మళ్లీ రియో ఒలింపిక్స్ తర్వాత కూడా అదే పునరావృతమైంది. ఆ తర్వాత పోరాడి ప్రయోజనం ఏముందనిపించింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. ఏ క్రీడాకారుడూ వివాదాలు కోరుకోడని, కానీ తన హక్కుల కోసం పోరాడాల్సి వచ్చిందని ఆమె పేర్కొంది. ఒలింపిక్ ఛాంపియన్ నీరజ్ చోప్రా దీనికి సరైన ఉదాహరణ అని, ఒక ప్రపంచ ఛాంపియన్‌ను తయారు చేయడానికి ఎంత వ్యక్తిగత శ్రద్ధ, పెట్టుబడి అవసరమో అతన్ని చూస్తే తెలుస్తుందని జ్వాల వెల్లడించింది. "ఎలాంటి ఆర్థిక మద్దతు, స్పాన్సర్‌షిప్ లేకుండానే నేను వరల్డ్ నంబర్ 5కి చేరుకున్నాను. అదే మద్దతు ఉండి ఉంటే నంబర్ వన్ అయ్యేదాన్ని" అని జ్వాలా తెలిపింది. క్రీడా వ్యవస్థలో మార్పు రావాలని, నేటి క్రీడారంగంలో రాజకీయ పలుకుబడి ఉన్నవారి మాటే నెగ్గుతోందని ఆమె వ్యాఖ్యానించింది.

## అది అసాధారణం కాదు.. సాధారణ విషయం



భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, అర్జున అవార్డు గ్రహీత గుత్తా జ్వాల ఒక గొప్ప సామాజిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టి అందరి మన్ననలు పొందుతున్నారు. ప్రసవం తర్వాత మొదటి సంవత్సరంలో తాను దాదాపు 60 లీటర్ల తల్లిపాలను హైదరాబాద్, చెన్నైలోని ప్రభుత్వ ఆసుపత్రులకు దానం చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ చర్య ద్వారా మాతాశిశు సంరక్షణ, తల్లిపాల దానం ప్రాముఖ్యతపై విస్తృత చర్చకు దారి తీశారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ప్రత్యేకంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో జ్వాల గుత్తా ఈ విషయాలను పంచుకున్నారు. "తల్లిపాల దానం గురించి నాకు నిజానికి పెద్దగా తెలియదు. నా వైద్యుల ప్రోత్సాహంతోనే దీనికి పూనుకున్నాను. అనేక కారణాల వల్ల బిడ్డలకు పాలు ఇవ్వలేని తల్లులకు, ముఖ్యంగా నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు దాతల నుంచి సేకరించిన పాలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు వివరించారు" అని ఆమె తెలిపారు. కేవలం 100 మిల్లీలీటర్ల తల్లిపాలు, ఒక కిలో బరువున్న చిన్నారికి చాలా రోజుల వరకు సరిపోతాయని, ఎంతోమంది పసికందుల ప్రాణాలను కాపాడవచ్చని ఆమె పేర్కొన్నారు. తల్లిపాలను 'లిక్విడ్ గోల్డ్' అని పిలుస్తారని, ఇందులో యాంటీబాడీలు, పోషకాలు పుష్కలంగా ఉంటాయని, శిశువుల రోగనిరోధక శక్తిని పెంచుతాయని జ్వాల వివరించారు. "నేను నా బిడ్డకు అవసరమైన దానికంటే ఎక్కువ పాలను ఉత్పత్తి చేస్తున్నానని గ్రహించాను. అందుకే ఇతరులకు సహాయం చేయాలని నిర్ణయించుకున్నాను. ప్రతి రెండు, మూడు గంటలకు ఒకసారి పాలను పంప్ చేయాల్సి వచ్చేది. ఈ ప్రక్రియ శారీరకంగా బాధాకరమైనా, అలసట కలిగించినా, ఆ పాలు ఒక చిన్నారికి ఉపయోగపడతాయనే ఆలోచన ఎంతో సంతృప్తినిచ్చింది" అని ఆమె అన్నారు.

### కోపంలో హద్దుమీరిన హార్దిక్ పాండ్యాకు భారీ జరిమానా!



ముంబై ఇండియన్స్ (ఎంఐ) కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు ఐపీఎల్ యాజమాన్యం జరిమానా విధించింది. కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)తో జరిగిన మ్యాచ్‌లో ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అతడి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత విధించడంతో పాటు ఒక డీమెరిట్ పాయింట్‌ను ఖాతాలో జత చేసింది. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రెండో ఇన్నింగ్స్ 10వ ఓవర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. బౌలింగ్ రనప్ కోసం వెళ్తూ హార్దిక్ పాండ్యా కోపంగా వికెట్ల బెయిల్స్‌ను చేత్తో గట్టిగా కొట్టి పడగొట్టాడు. ఇది ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌లోని ఆర్టికల్ 2.2 ప్రకారం 'క్రికెట్ పరికరాలను దుర్వినియోగం చేయడం' కిందకు వస్తుందని ఐపీఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. మ్యాచ్ రిఫరీ రాజీవ్ సేథ్ విధించిన ఈ శిక్షను హార్దిక్ అంగీకరించాడు. ఇక మ్యాచ్ విషయాని కొస్తే, ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ ఈ మ్యాచ్‌లోనూ ఓటమి పాలైంది. మొదట బ్యాటింగ్ చేసిన ముంబైని కేకేఆర్ బౌలర్లు 147/8 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 148 పరుగుల లక్ష్యాన్ని కేకేఆర్ మరో ఏడు బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. మనీశ్ పాండే, రోవ్‌మన్ పావెల్ కీలక భాగస్వామ్యంతో తమ జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విజయంతో కేకేఆర్ తమ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. మ్యాచ్ అనంతరం హార్దిక్ మాట్లాడుతూ.. "పవర్‌ప్లేలో ఎక్కువ వికెట్లు కోల్పోవడం మా ఓటమికి కారణమైంది. ఇలాంటి బౌలర్లకు అనుకూలించే పిచ్‌లపై ఆడటాన్ని నేను ఆస్వాదిస్తాను. ఐపీఎల్‌లో బ్యాటర్ల ఆధిపత్యం పెరిగిపోతున్న తరుణంలో ఇలాంటి వికెట్లు బౌలర్లకు కూడా అవకాశం కల్పిస్తాయి" అని వ్యాఖ్యానించాడు.

# మెగా క్లాప్: 30 ఏళ్ల రివర్స్ సీన్..

## తమ్ముడి క్లాప్ పై చిరంజీవి ఎమోషనల్ ట్వీట్!

- అన్నయ్య సినిమాకు క్లాప్ కొట్టిన తమ్ముడు పవన్ కల్యాణ్
- 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' సినిమాను గుర్తుకు తెచ్చుకున్న మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి 158వ సినిమా పూజా కార్యక్రమాలతో ఈరోజు లాంఛనంగా ప్రారంభమైంది. ఈ ఓపెనింగ్ వేడుకకు ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. తన అన్నయ్య చిరంజీవి పై తీసిన ముహూర్తపు షాట్‌కు పవన్ కల్యాణ్ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ క్లాప్ బోర్డ్ వెనుక ఉన్న ఒక అద్భుతమైన 30 ఏళ్ల నాటి విషయాన్ని గుర్తుచేస్తూ చిరంజీవి ఎక్స్‌లో ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "ఈ రోజు కల్యాణ్ బాబుకి, నాకు మధ్యలో క్లాప్ కనిపిస్తుంటే... 30 సంవత్సరాల క్రితం ఇదే సీన్ రివర్స్‌లో జరిగిన సందర్భం గుర్తుకు వస్తోంది ... 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. ఈ రోజు డిప్యూటీ సీఎం హోదాలో టైమ్ తీసుకుని వచ్చి, నా 158వ సినిమా ముహూర్తంలో పాల్గొని, క్లాప్ ఇచ్చి యూనిట్ సభ్యులందరినీ ఆనందపరిచినందుకు థాంక్యూ" అని చిరంజీవి భావోద్వేగాన్ని వ్యక్తం చేశారు.




ఫ్లాష్‌బ్యాక్: సరిగ్గా 30 సంవత్సరాల క్రితం, పవన్ కల్యాణ్ హీరోగా సినిమా ఇండస్ట్రీకి పరిచయమైన క్లాసిక్ మూవీ 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి' (1996). ఆరోజు ఆ సినిమా ముహూర్తపు షాట్‌కు అన్నయ్యగా చిరంజీవి ముందుండి తమ్ముడు పవన్ కల్యాణ్‌కు క్లాప్ కొట్టి వెండితెరకు పరిచయం చేశారు. ఇవాళ అదే సీన్ రివర్స్ అయింది. ఆరోజు అన్నయ్య క్లాప్ కొట్టి తమ్ముడిని ఆశీర్వదించారు. ఈరోజు తమ్ముడు ఏకంగా ఒక రాష్ట్రానికి డిప్యూటీ సీఎం హోదాలో వచ్చి.. అన్నయ్య 158వ సినిమాకు క్లాప్ కొట్టారు. మూడు దశాబ్దాలు గడిచినా, మెగా బ్రదర్స్ మధ్య ఉన్న అనుబంధం మాత్రం అలాగే ఉందనడానికి ఈ క్లాప్ బోర్డ్ విజువల్ ఒక పెద్ద నిదర్శనం. మరోవైపు, ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇందులో మలయాళ యువ నటి అనశ్వర రాజన్ కీలక పాత్ర పోషిస్తోంది.

## 'డ్రాగన్' గ్లింప్స్‌తో ఎన్టీఆర్ సంచలనం.. యూట్యూబ్‌లో ఆల్ టైమ్ రికార్డ్!




యంగ్ టైగర్ ఎన్టీఆర్, సంచలన దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో వస్తున్న 'డ్రాగన్' సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ 43వ పుట్టినరోజు సందర్భంగా మే 20న విడుదల చేసిన 'డ్రాగన్' ప్రిల్యూడ్ గ్లింప్స్ యూట్యూబ్‌లో సరికొత్త చరిత్ర సృష్టించింది. విడుదలైన తొలి 24 గంటల్లోనే 64 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించి, భారత సినీ చరిత్రలో ఒకే యూట్యూబ్ ఛానెల్‌లో అత్యధిక వ్యూస్ పొందిన గ్లింప్స్‌గా ఆల్ టైమ్ రికార్డును నెలకొల్పింది. 4 నిమిషాల 28 సెకన్ల నిడివి ఉన్న ఈ గ్లింప్స్‌ను తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేశారు. 1967 నాటి ప్రపంచ నల్లమందు వ్యాపార సామ్రాజ్యం నేపథ్యంలో కథ సాగుతుందని ఈ వీడియో ద్వారా స్పష్టం చేశారు. 'లూగర్' అనే క్రూరమైన పాత్రలో ఎన్టీఆర్ కనిపించనున్నారు. మరోవైపు నార్కోటిక్స్ బ్యూరో చీఫ్ రఘువీర్ రాథోడ్‌గా అనిల్ కపూర్ నటించడంతో ఇద్దరి మధ్య పోరు ఉత్కంఠ రేపుతోంది.

## అభిమానికి క్షమాపణ చెప్పిన వరుణ్ ధావన్.. నెట్టింట ప్రశంసల వర్షం



బాలీవుడ్ యంగ్ హీరో వరుణ్ ధావన్ తన అభిమాని పట్ల చూపిన చొరవ, చెప్పిన క్షమాపణ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లక్నోలో జరిగిన ఓ ప్రమోషనల్ ఈవెంట్‌లో తనను కలవడానికి గంటల తరబడి ఎదురుచూసిన ఓ అభిమానిని కలవలేకపోయినందుకు ఆయన బహిరంగంగా విచారం వ్యక్తం చేశారు. హీరో స్పందించిన తీరు పై నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. వరుణ్ ధావన్, ఆయన తండ్రి డేవిడ్ ధావన్ కాంబినేషన్‌లో వస్తున్న 'హై జవాని తో ఇష్క్ హోనా హై' సినిమా ప్రమోషన్ల కోసం చిత్రబృందం ఇటీవల లక్నోలో పర్యటించింది. ఈ కార్యక్రమంలో వరుణ్‌తో పాటు నటి మృణాల్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. తమ అభిమాన హీరోను చూసేందుకు ఫ్యాన్స్ భారీగా తరలివచ్చారు. అయితే, ఓ మహిళా అభిమాని.. తాము 5 గంటల పాటు ఎదురుచూస్తే, వరుణ్ కేవలం 5 నిమిషాల్లోనే వెళ్లిపోయారంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియో పోస్ట్ చేసి తన నిరాశను వ్యక్తం చేసింది. ఈ పోస్ట్ వైరల్ అవ్వడంతో వరుణ్ ధావన్ వెంటనే స్పందించారు. అదే పోస్ట్‌కు బదులిస్తూ.. "క్షమించండి, నేను మీకు ఆటోగ్రాఫ్ ఇవ్వలేకపోయాను. పోలీసులు మమ్మల్ని కాస్త ముందుగానే అక్కడినుంచి పంపించేశారు" అని వివరణ ఇచ్చారు. దీంతో పాటు, ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో మరో వీడియో పోస్ట్ చేసి లక్నో అభిమానులందరికీ క్షమాపణలు తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఏర్పాట్లతో పెద్ద వేదికపై కార్యక్రమం నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. స్టార్ హీరో అయి ఉండి కూడా ఒక సాధారణ అభిమాని పోస్ట్‌కు స్పందించి, క్షమాపణ చెప్పడం పట్ల నెటిజన్లు వరుణ్‌ను అభినందిస్తున్నారు. ఈ చిత్రంలో పూజా హెగ్డే మరో కథానాయికగా నటిస్తోంది.

## రామ్ చరణ్ 'పెద్ది' సినిమా కథకు సంబంధించి కీలక హింట్ ఇచ్చిన బొమన్ ఇరానీ






గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవెయిటెడ్ పాన్ ఇండియా మూవీ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సినిమా గురించి బాలీవుడ్ ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ చేసిన ఆసక్తికర వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో వైరల్ అవుతున్నాయి. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలో ఆయన ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమాకు సంబంధించిన ఒక స్పెషల్ గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా. తాజాగా బొమన్ ఇరానీ సినిమా కథాంశంపై ఒక ముఖ్యమైన హింట్ ఇచ్చారు. బొమన్ ఇరానీ మాట్లాడుతూ ""పెద్ది' చాలా అద్భుతమైన సినిమా. రామ్ చరణ్ ఎంతో గొప్ప నటుడు. చాలామంది ఈ చిత్రాన్ని కేవలం స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సాధారణ కమర్షియల్ మూవీగా భావిస్తున్నారు. కానీ, ఇందులో ప్రేక్షకులను అలరించే స్పోర్ట్స్ డ్రామాతో పాటు, అంతర్లీనంగా గుండెలను హత్తుకునే బలమైన దేశభక్తి అంశాలు కూడా ఉంటాయి. ఇదొక కంప్లీట్ ఎమోషనల్ ఎంటర్‌టైనర్" అని కొనియాడారు. బొమన్ ఇరానీ చెప్పిన ఈ పాయింట్ సినిమా పై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ చిత్రానికి ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, వృద్ధి సినిమాస్ పతాకం పై మైత్రీ మూవీ మేకర్స్ భాగస్వామ్యంతో ఈ సినిమా తెరకెక్కింది. క్రీడా నేపథ్యానికి దేశభక్తి తోడవడమనేది రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## 'డ్రాగన్' కోసం ఎన్టీఆర్ 4 నెలల్లో 15 కేజీలు తగ్గారు..



యంగ్ టైగర్ ఎన్టీఆర్ పుట్టినరోజు (మే 20) సందర్భంగా ఆయన అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'డ్రాగన్' సినిమా ఫస్ట్ గ్లింప్స్ విడుదలైంది. ఇందులో ఎన్టీఆర్ గతంలో ఎన్నడూ చూడని ఉగ్రమైన అవతార్‌లో కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఈ లుక్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తుండగా, దీని వెనుక తారక్ పడిన కఠోర శ్రమ గురించి దర్శకుడు ప్రశాంత్ నీల్ వెల్లడించిన విషయాలు సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి.

**ఒక చిన్న సూచనకే 15 కిలోలు తగ్గారు**

ఒక ఇంటర్వ్యూలో ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'డ్రాగన్' పాత్ర కోసం ఎన్టీఆర్ కేవలం నాలుగు నెలల్లో దాదాపు 15 కిలోల బరువు తగ్గారని తెలిపారు. "దాదాపు ఏడాదిన్నర క్రితం, షూటింగ్ ప్రారంభించడానికి ముందు ఒక లుక్ టెస్ట్ చేశాం. ఆ సమయంలో ఈ పాత్ర కోసం ఆయన ఇంకాస్త సన్నగా, పదునుగా కనిపిస్తే బాగుంటుందని నేను సూచించాను. హంతకుడి పాత్ర కాబట్టి కొద్దిగా బరువు తగ్గితే బాగుంటుందని చెప్పాను" అని నీల్ గుర్తుచేసుకున్నారు.

**ఆపమని చెప్పినా ఆయన ఆగలేదు**

అయితే, తన చిన్న సూచనకు ఎన్టీఆర్ ఊహించని రీతిలో స్పందించారని నీల్ వివరించారు. "ఆ తర్వాత నాలుగు నెలల పాటు ఆయన షూటింగ్‌కు రాలేదు. ఒకానొక దశలో ఏకంగా 15 కిలోల బరువు తగ్గారు. ఆయన పాలిపోయి, బలహీనంగా కనిపించడం మొదలుపెట్టాక చాలాసార్లు ఆపమని చెప్పాను, కానీ ఆయన ఆగలేదు" అని నీల్ పేర్కొన్నారు.

**ఎన్టీఆర్ కుటుంబసభ్యులు సైతం ఆందోళన**

ఈ తీవ్రమైన బరువు తగ్గుదల ఎన్టీఆర్ కుటుంబసభ్యులను సైతం ఆందోళనకు గురిచేసిందని ప్రశాంత్ నీల్ తెలిపారు. "ఆయన భార్య, తల్లి, స్నేహితులు.. అందరూ నాపై కోపంగా ఉన్నారు. చివరకు నా టీమ్ కూడా నాతో అసంతృప్తిగా ఉంది. కానీ, నేను కేవలం కొద్దిగా బరువు తగ్గమని మాత్రమే చెప్పాను. ఆయనే దానిని తీవ్రంగా తీసుకున్నారు. ఆ సమయంలో ఆయన చాలా బాధపడటం మేం చూశాం. ఆ నింద అంతా నాపైనే పడింది" అని నీల్ వివరించారు. అయితే, ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ అంతా చాలా ప్రొఫెషనల్‌గా జరిగిందని నీల్ స్పష్టం చేశారు. తాను బరువు తగ్గాలని సూచించిన 30 నిమిషాల్లోనే ఎన్టీఆర్ ట్రైనర్ అక్కడికి వచ్చారని, మరుసటి రోజు ఉదయం నుంచే ప్రక్రియ మొదలుపెట్టారని చెప్పారు. ఇందుకోసం షూటింగ్‌ను కొన్ని నెలల పాటు వాయిదా వేయాల్సి వచ్చినా, చివరికి వచ్చిన ఫలితం పట్ల తాము చాలా సంతోషంగా ఉన్నామని నీల్ తెలిపారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449